చెక్క బొమ్మ!

కంచర్ల రమణ

నాకు సాధువులన్నా, బాబాలన్నా, దేవుడి భక్తులన్నా నమ్మకంలేదు. వీళ్లు దేవుడిపేరు చెప్పి, తమ పబ్బం గడుపుకొంటున్న పెద్ద మనుషులని నా అభిప్రాయం.

మనిషి యే మూలనో ముక్కు మూసుకుని, మనస్సు ద్వారా సర్వం చెయ్యగలిగితే, ఉద్యోగులు ఆఫీసుల కెందు కెళ్ళడం? రైతులు పొలాల్నెందుకు దున్నడం? వ్యాపారస్తులు దుకాణాలు తెరిచి, ఉదయంనించి రాత్రి వరకూ బేరాలకోసం కాచుక్కూచోవడం దేనికి?

పరీక్ష పాసు కాదలచినవాడు, పుస్తకాలు పట్టుకుని చదివితే, పరీక్ష పాసవుతాడుగాని, పూజలుచేస్తూ, గుళ్ళ చుట్టూ తిరిగితే, పరీక్ష పాసవుతాడా?

అలాగే నాకు దేవుడన్నా, మానవాతీత శక్తులన్నా నమ్మకంలేదు. ఏనాడో మానవుడు తన చుట్టూవున్న ప్రకృతిని శాస్త్రీయ దృష్టిలో అర్థం చేసుకోలేక, తన కన్నా బలీయమైన శక్తేదో ఉందని ఊహించి, దానికి దేవుడని ఓ పేరుపెట్టి, అతడికి అవతారాలు వగైరా అంటగట్టారని నా అభిప్రాయం.

నా యీ భావాల గురించి నా స్నేహితులకు బాగా తెలుసు. ఎన్నోసార్లు, వాళ్ళ నమ్మకాల్ని, వాళ్ళ ప్రవర్తనల్ని ఖండించాను నిర్మొహమాటంగా.

నాకున్న చాలామంది స్నేహితుల్లో శేఖరం ఒకడు. వారంరోజుల క్రితం, వాడో రోజున "మన వూళ్ళోకి అవధాని అని ఒకాయన వచ్చాడు తెలుసా?" అన్నాడు.

"ఈ టౌనుకి సవాలక్ష శాల్తీలు వచ్చి వెళ్తుంటాయి. వాళ్ళగురించి తెలుసుకోవల్సిన అవసరంగాని, అగత్యంగాని నాకులేదు" అన్నాను దురుసుగా.

"మరీ అంత తీసేసినట్టుగా మాట్లాడకు. ఆయన చాలా గొప్ప మనిషి... ఆయనతో నాకు కాస్త పరిచయముంది. తీసుకెళ్తాను. వస్తావా? మాట్లాడుదువుగాని" అన్నాడు శేఖరం.

"ఆయన తూర్పు. నేను పడమర. ఆయనతో నాకు మాటలేమిటి? ఇంతకూ, పరిచయమంటున్నావు. ఎలా గయిందిరోయ్, ఆ వింత జీవితో పరిచయం?" అన్నాను నవ్వుతూ.

"మా బంధువుల్లో ఒకామెకు ఫిట్స్ వస్తుండేవి. ఎందరో డాక్టర్లకు చూపించారు. నయం గాలేదు. చివరికీయని చేతిలో పూర్తిగా బాగయింది" చెప్పాడు శేఖరం.

"ఆ విషయం నాకు ఎప్పుడూ చెప్పలేదేం?" అన్నాను ఆశ్చర్యంగా.

"నీ కలాంటివంటే కిట్టవని నాకు తెలుసు. పైగా వేళాకోళమాడతావు. అందుకే చెప్పలేదు," చెప్పాడు వాడు.

ఏ మూడ్‌లో ఉన్నానో "సరే! ఆయనతో మాట్లాడితే, ఏం పోయింది? మాట్లాడినందుకు ఫీజు వసూలు చెయ్యడు గదా?" అన్నాను నవ్వుతూనే.

"ఛ! ఛ! యీనాటి డాక్టర్లవంటివాడు కాడు, రోగం నయమైనా, కాకపోయినా, ఫీజు వసూలు చేయడానికి. ఓ విధంగా చెప్పాలంటే, ఆధ్యాత్మిక తత్వంవైపు మనుషుల్ని మళ్ళించాలనే ఆయన తాపత్రయమంతా... మొండిరకం నాస్తికుల్ని తనవద్దకు తీసుకురమ్మని అడుగు తుంటాడు, తనదగ్గరకు వచ్చినవాళ్ళని."

మరునాడు అవధాని తోటి ఇంటర్వ్యూ. శేఖరం నన్ను తీసుకెళ్ళాడు.

సాదరంగా ఇద్దర్నీ లోనికి ఆహ్వానించి కుషన్డ్ ఛెయిర్స్‌లో కూచోబెట్టాడు అవధాని. తనువచ్చి, మా కెదురుగా సోఫాలో కూచున్నాడు.

అవధానిని చూడగానే, అతనో విచిత్ర వ్యక్తని అనిపించింది నాకు.

అతణ్ని చూడక పూర్వం 'స్పిరిట్యువలిస్ట్ అవధాని' అని నేను విన్నమాటలు నా మనసులో ఓ ఆకారాన్ని సృష్టించాయి. దాని ప్రకారం, అవధాని తెల్లని పంచె కట్టుకుని, తెల్లని జుబ్బా వేసుకుని, ఓ పిలకతో, నుదుటి మీద పిండి కట్లతో ఉండాలి.

అంతేకాదు. మేం వెళ్ళేసరికి, ఓ, తుంగచాపో, జంబుఖానో యిచ్చి, కూర్చోమనాలి. తనున్న గదినిండా, లోకంలో ఉన్న దేవుళ్ళందరి ఫోటోలు వేలాడుతూ, వాటిమీద ఒత్తుగా గంధం, కుంకుమ, పసుపు, అక్షింతలు చల్లబడి, గదిలో అగరొత్తుల వాసన అలుముకొని ఉండాలి.

కాని, నేను చూసిన అవధాని నా మనసులో ఏర్పడ్డ రూపానికి పూర్తిగా వ్యతిరేకం. చూడగానే, విస్తుపోయాను. కాదు, షాక్ తిన్నాను.

ఇతడు ఫుల్ సూట్‌లో ఉన్నాడు. ఒత్తుగా జులపాలు, పొడవుగా మీసాలు పెంచాడు. తనున్న ఆ గదిలో ఒకటి రెండుచోట్ల మాత్రం దేవుడి ఫోటోలు ఉన్నాయి. మనిషి సాధారణమైన ఎత్తుగా, తెల్లగా, హుషారుగా వున్నాడు. వయస్సు నలభై లోపు ఉండవచ్చు.

అతడ్ని చూసీ చూడగానే, ఆకర్షించుకున్నవి, దీపాల్లాండి అతని కళ్ళయితే, నవ్వు తెప్పించింది, మోస్ట్ మోడర్న్‌గా అవుపిస్తున్న అతడి నుదుటిమీది యెర్రని కుంకుమ బొట్టు.

వెళ్ళీ వెళ్ళగానే, కాసేపు అతనితో ఏం మాట్లాడాలో తెలీక, నేనూ శేఖరం తికమకపడ్డా, మా ఇబ్బంది తెలుసుకుని ఆయనే సంభాషణ మొదలుపెట్టాడు.

"సృష్టి మొత్తంలో మానవుడి మనసు అతి శక్తివంతమైనది" అన్నాడు.

"అదెలా?" అన్నాను ఆశ్చర్యంగా నేను.

శేఖరం నా ప్రక్కనే కూచున్నాడు. ఎవరి పక్షమూ వహించక, మా వాగ్యుద్ధాన్ని కుతూహలంగా ఆలకించసాగాడు.

ఒక్క క్షణం అవధాని కళ్ళు అర్ధనిమీలితాలై, ఆ తరువాత మళ్ళా మావైపు తీక్ష్ణంగా చూడసాగాయి.

"ఉదాహరణకు ఇప్పుడు మనం కూర్చున్న యీ హోటలునే తీసుకుందాం. ఈ హోటలు కట్టటం వెనకాల ఓ ప్లాను ఉందా?" అడిగాడు అవధాని.

"ఉంది" అన్నాను నేను.

"అయితే, అదెక్కణ్నించి వచ్చింది?"

అవధాని ప్రశ్నకు నేనేం జవాబివ్వలేదు. అతనే మాట్లాడేడు మళ్ళా.

"ఓ మనిషి ఆలోచనలోంచే గదా! ఆలోచనలకి కేంద్రం మెదడని నేను వేరేగా చెప్పక్కర్లేదు. అదే విధంగా ఏ వస్తువుని తీసుకుని, దాని పుట్టుకను వెతుక్కుంటూ పోయినా దానికి కూడా మనిషి మెదడే అని తేలుతుంది. కావలిస్తే, మీకు తోచిన వస్తువుని తీసుకుని, దాని ఆరిజన్ వెతకండి," అంటూ మవునం వహించాడు.

నేను ఆలోచించడం మొదలుపెట్టాను. సృష్టిలో సహజసిద్ధంగా లభ్యమయ్యేవి తప్ప, మిగతావాటి పుట్టుకకు, ఆధారం మెదడే అని అతడు చెప్పింది నిజమే ననిపించింది.

"మీరు చెప్పింది ఒప్పుకోక తప్పదు. మానవుడు సృష్టించే ప్రతి వస్తువు వెనకాల, అతడి ఆలోచన వుంది. ఆ ఆలోచనలకు కేంద్రం మెదడు. సత్యాన్ని ఒప్పుకోవ డానికి నేనెన్నడూ వెనుకాడను" అన్నాను.

"వెరీ గుడ్" అంటూ మళ్ళా మొదలెట్టాడు అవధాని. "మనిషి మెదడు మాగ్నెట్ లాంటిది" అని ఒక క్షణం దీర్ఘంగా ఆలోచించి, "మాగ్నెట్ 'లాంటిది' అని ఎందు

కనాల్సి వస్తోందంటే, మాగ్నెట్‌లా అది భౌతికమైన వాటిని ఆకర్షించుకోదు. కాని, నిజానికి దాని ఆకర్షించే శక్తి మాగ్నెట్‌కన్నా ఎంతో ఎక్కువ. మనస్సు కేంద్రీకరించి, హోల్ హార్టెడ్‌గా దేన్నైనా కోరుకుంటే, అది లభ్యం కాలేదన్న సంగతి ఇంతవరకూ దాఖలాలో లేదు. కావలిస్తే చూసుకోండి,'' అని అనేసి అవధాని మళ్ళా మౌనం వహించబోయాడు. కాని, నేను అందుకొన్నాను.

‘‘వాట్ నాన్సెన్స్! నేను యిప్పుడు సినిమాస్టారు నయిపోవా లనుకుంటే అయిపోతానా? ఇంగ్లీషులో ఓ సామెత వుంది లెండి. కోరికలు గుర్రాలైతే, బిచ్చగాళ్ళు వాటిని స్వారీ చెయ్యకపోయేరా అని, కోరుకున్నంత మాత్రాన అన్నీ జరిగిపోతే, ఇంకేముంది, ఈ లోకంలో? వాలుకుర్చీలో కూచుని, ఎడారిలో పంటలు పండించవచ్చు,'' అన్నాను నవ్వి.

అవధాని నవ్వలేదు. నావైపు తీక్షణంగా చూసాడు. నిజానికి అవి చూపుల్లా లేవు. ఎక్స్‌రేస్‌లా, నా అంతరాంతరాల్లోకి చూస్తున్నట్టుగా వున్నాయి.

‘‘మీ రెప్పుడయినా మీ జీవితంలో సీరియస్‌గా దేన్నైనా కోరుకున్నారా?'' అడిగాడు అవధాని.

‘‘ఓ యస్!...ఒకటి కాదు. చాలా.''

‘‘అందులో ఒకటి చెప్పండి.''

‘‘నేనో మంచి నటుడ్ని కావాలనుకొన్నాను.''

‘‘మరి, ఆ కోరిక, ఏ దశవరకూ వచ్చి ఆగిపోయింది?''

‘‘దానికో దశ లేదు. అది కోరికగానే మిగిలిపోయింది.''

‘‘ఏం అలాగ? ఏ నాటక సమాజంలో చేరడానికో, లేదా మీరే, ఓ సమాజం స్థాపించడానికో ప్రయత్నించలేదా?''

"అదిగో! ప్రయత్నం సంగతి యిక్కడ తీసుకు రాకండి. నేను నటుడ్ని కావాలనుకున్నాను... కాలేక పోయాను. అయినా, ఓ సమాజంలో చేరాలనుకున్నా, ఓ సమాజాన్ని మనంతట మనం ఆరంభించినా, చేతి చమురు చాలా వదుల్తుంది. నా దగ్గర అంత డబ్బెక్కడుంది?"

మొట్టమొదటిసారిగా నవ్వాడు అవధాని. ఆ నవ్వులో ఓ ప్రత్యేకత వుంది. అదేమిటో నా కర్థంకాలేదు గాని, నా గుండెల్లో దీపాలు వెలిగినట్టయింది. ఒంట్లో యేదో ఉత్తేజం!

"అంటే, మీదో ఐడిల్ విష్ అన్నమాట! నటుడు కావాలన్న కోరిక మీలో నిజంగానే బలంగా వుంటే, ఓ నాటక సమాజంలో చేరడానికో, లేదా మీరంతట మీరే, ఓ సమాజం స్థాపించడానికో పూనుకునేవారు. మనిషిలో కోరిక బలంగా వుంటే, రెండు కాళ్ళూ లేని అవిటివాడు కూడా తప్పక నడవగలడు."

అవధాని వాదన నాకు వితండంగా అనిపించింది. మొహంలో ఆశ్చర్యముద్రతో, అతనివైపు క్షణం చూసి, ఏదో మాట్లాడుదామని నేను ఉపక్రమించేసరికి, మళ్ళా ఆయనే, ఆరంభించాడు.

"నేను చెప్తున్నది శాస్త్రం. అవాకులూ, చవాకులూ కాదు. మీకు యీ క్షణంలో దాహం వేస్తోందనుకోండి. నీళ్ళు తాగాలన్న మీలో కలిగిన కోరిక తీవ్రమై అంతటితో ఆగిపోదు. అది ప్రయత్నంగా రూపొందుతుంది. మీరు నీళ్ళకుండ దగ్గరకో, పైపు దగ్గరకో వెళ్ళి నీళ్ళు తాగేంతవరకూ విశ్రమించరు.

అంచేత మీలో నటుడు కావాలన్న కోరిక బలంగా

లేకపోబట్టే, అన్‌కాన్షియస్‌గా మీ మనస్సు డబ్బులేదు, తీరుబడి లేదు. ఫలానా నటుడు ఫైల్‌లో వుండగా నేను గొప్ప నటుడ్ని కాగలనా వగైరా సాకుల్ని సృష్టించు కుంది. అందుకే మీరు నటులు కాలేకపోయారు.

"ఇజ్రాయిలీ పారాట్రూపర్ యూరీ గెల్లర్ గురించి మీరు వినేవుంటారు. చెంచాల్ని, ఫోర్కుల్ని తన తీవ్ర మైన చూపుల్తో వంచేస్తాడు. ఆగిపోయిన వాచీలని తన మనోశక్తిద్వారా పని చేయించడమూ, పనిచేస్తున్న వాటిని ఆపేయడమూ, అవలీలగా చేయగలడు.

అలాగే ఓ చైనా డాక్టరు గురించికూడా వినేవుంటారు. దూరంగా ఎక్కడోవున్న రోగుల రోగాల్ని, ప్రసిద్ధ వైద్యులు మందులద్వారా నయం చెయ్యలేమని వదిలేసిన మొండిరోగాల్నికూడా, తన మనోశక్తిద్వారా నయం చేస్తున్నాడట.

పేరా సైకాలజీ అని ఓ సైన్సు వుంది. అది యిప్పు డిప్పుడే గుర్తింపబడుతోంది. థాట్, ట్రాన్స్‌ఫరెన్స్, టెలీపతీ, ఓ అపరిచిత వ్యక్తి గురించి, అతనికి సంబంధించిన వస్తువుని మాత్రం ముట్టుకుని చెప్పడం, ఘన వస్తువుల వెనకాల వున్నవాటి గురించి చూడకుండా చెప్పడం వగైరా శక్తులు అసత్యాలు కావు నిజమే, అవి మేధస్సు కున్న అపూర్వశక్తియొక్క కొన్ని రూపాలు అంటూ చాటి చెపుతోంది ఆ శాస్త్రం. ఈ శాస్త్రంమీద పశ్చిమ దేశాల్లో ఎంత నమ్మకం యేర్పడిందంటే, ఏజ్ ఆఫ్ ఇర్రే షనలిజమ్ మొదలయిం దంటున్నారు, సాంఘిక శాస్త్ర వేత్తలు కొందరు" అంటూ అవధాని ఒక్కక్షణం ఆగాడు ఊపిరి పీల్చుకోవడానికి.

"సార్! వాదనలతో లాభంలేదు. మానవుడి మెదడు అపూర్వ శక్తివంత మంటున్నారు. అందుకు నిరూపణ కావాలి. అంచేత మీ మనస్సుద్వారా ఓ పని చేసి చూపండి" అన్నాను సవాలు చేస్తున్నట్టుగా.

ఆయన భుజాలెగరేసి, "ఏం చెయ్యమంటారో మీరే చెప్పండి" అన్నాడు.

తలెత్తి గోడల పైభాగంవైపు చూడసాగాను. అక్కడ అందంగా నగిషీల డోమ్స్‌లో వున్న బల్బ్స్ అవుపించాయి.

వాటిని చూడగానే నా మెదడులో మెరుపు మెరిసినట్టయింది.

"నా కెదురుగావున్న డోమ్‌లో బల్బ్ వున్నట్టే, మీ కెదురుగా ద్వారానికి పైన, డోమ్‌లో బల్బ్ వుంది. మీరు దాన్ని ముట్టుకోకుండా, పగలగొట్టెయ్యాలి, మీ మనోశక్తి ద్వారా" అన్నాను.

"ఓస్! ఇంతేనా!" అన్నట్టుగా నవ్వాడు అవధాని.

"ఓకే! అలాగే!...అయితే, ఆ బల్బ్ ఖరీదు మీరు హోటలువాడికి చెల్లించుకోవాల్సి వుంటుంది. ఏమంటారు?" అన్నాడు మళ్ళీ అవధాని నవ్వుతూ.

"ఓకే! నేనూ సిద్ధమే!" అన్నాను పౌరుషంగా.

అవధాని వెంటనే కళ్ళు మూసుకున్నాడు. కొద్దిగా బిగుసుకున్నట్టు అయిన అతని మొహంవైపు చూస్తూ కూచున్నాను, కుతూహలంగా.

నా ప్రక్కన కూచున్న శేఖరం మొహంలోకూడా అదే కుతూహలం కదలాడుతోంది.

అయిదు నిముషాలు గడిచాయి బరువుగా.

అవధాని టక్కున కళ్ళు తెరిచాడు. ఆ కళ్ళు దీపాల్లా మహా తేజోవంతంగా వున్నాయి. బల్బ్ వైపు చూసి, "హా!" అన్నాడు కుడిచెయ్యి యెత్తి గసిరినట్టుగా.

అంతే!...ఎవరో ఓ రాయితోనో, కర్రతోనో బల్బ్‌ను పగలగొట్టినట్టుగా, బల్బ్ పగిలి, నేలమీద పడి గల్లుమని శబ్దం చేసింది.

నేను అవాక్కయిపోయాను. అదే పరిస్థితిలో వున్నాడు శేఖరంకూడా.

కనికట్టు కాదు గదా?...అనుమాన మొచ్చింది.

కళ్ళు నులుముకొని లేచి, గోడదగ్గర పడిన గాజు ముక్కల్ని చేత్తో తీసి చూసాను.

అవి గాజు ముక్కలే! సందేహం లేదు.

కాని, కనికట్టు చాలా సేపు వుంటుందంటారు. కనికట్టు వున్నంత సేపు, భ్రాంతి నిజంలాగానే అనిపిస్తుందంటారు. నిజానికి బల్బ్ పగలలేదేమో?

అదే సమయంలో నా సందేహం నివృత్తిచేసే ఓ అయిడియా వచ్చింది.

అవధాని గమనించకుండా, జేబులోంచి రుమాలు తీసి, రెండు గాజుముక్కల్ని అందులో చుట్టేసి, దాన్ని చల్లగా జేబులో కుక్కుకున్నాను.

"వెల్! ఏమంటారు యిప్పుడు?" అన్నాడు అవధాని, గర్వంతో మెరిసిపోతున్న మొహంతో.

"ఏమనాలో నాకు బోధపడ్డం లేదు. ఇది అసంభవం. ఇది సంభవమైతే, ఫిజికల్ అండ్ నేచురల్ లాస్ మాటేమిటి? నాకు అంతా అయోమయంగా వుంది. ఆలోచించుకోవడానికి టైము కావాలి. ప్రస్తుతానికి మాకు శెలవు యిప్పించండి," అన్నాను చేతులు జోడించి నమస్కరించి.

శేఖరంకూడా లేచాడు. వాడూ అవధానికి నమస్కరించాడు.

మేం బయటికి బయలుదేరబోతుంటే, "దిగువన మర్చిపోకుండా బల్బు ఖరీదు యిచ్చి మరీ వెళ్ళండి," అన్నాడు అవధాని.

2

ఒకరోజు కాదు, వారం రోజులున్నాయి బల్బు ముక్కలు నా వద్ద.

అవధాని చేసింది యెంతమాత్రం కనికట్టు కాదు. తన మనోశక్తి ద్వారానే, బల్బును పగలగొట్టాడని, నిర్ణయానికి రాక తప్పలేదు.

ఐతే, 'అదెలా సాధ్యమయింది?' అన్నది శేషప్రశ్న అయి కూచుంది నాకు.

శేఖరంగాడి దగ్గరకు పరుగెత్తి వెళ్ళి అడిగాను.

"ఒరేయ్! అర్థంలేని అనుమానాలతో చావకు. పైవాళ్ళను చంపకు. అవధాని నిజంగా శక్తిమంతుడు అవునా, కాదా అని యింకా తెలుసుకోవాలంటే, అతని దగ్గరే వుండి స్టడీ చేస్తే పోలా? నీ సందేహాలు అవధానిగాని, అవధానిలాంటి మంత్రవాదులు తీర్చాలిగాని నావంటివాళ్ళు కారు," అంటూ చిన్నసైజు లెక్చరు దంచేసాడు శేఖరం.

వాడలా లెక్చరివ్వడం కాదుగాని, నా అనుమానాలు తీరడానికి ఓ మార్గం అగపడినట్టయింది.

వెంటనే అవధానివద్దకు పరుగెత్తాను.

"నమస్కారం గురువుగారూ! నేనే ఓడిపోయాను. మీరే గెలిచారు," అన్నాను హాయిగా నవ్వి.

నమస్కారం అందుకుని, తల పంకించి "నాకు తెలుసు మీరు నావద్ద కిలా వస్తారని. అయితే, మీరు తెలుసుకోవడమే గాదు, మీ అనుభవాల్ని అందరికీ చెప్పాలి... ఈ యావత్తు ప్రపంచం ఒక పెద్ద సీ ఆఫ్ యూనివర్సల్ మైండ్ అనీ, తనకు కావాల్సినవన్నీ మానవుడు అందులోంచే యేరుకుని తెచ్చుకుంటాడనీ, మీరు నమ్మడమే గాదు, యితరులచేత నమ్మించాలి" అన్నాడు అవధాని.

"ఆ పని నేను చెయ్యాలంటే ముందు నన్ను మీ శిష్యుడిగా చేర్చుకోండి: ఆధ్యాత్మిక ప్రపంచంతో పరిచయం చెయ్యండి. లేదా, కనీసం ఆ ప్రపంచంలోని వింతలు చూసేలా చెయ్యండి," అన్నాను భక్తిపూర్వకంగా.

"నీకు తట్టుకునే శక్తి వుందా?" అన్నాడు అవధాని సీరియస్‌గా చూస్తూ.

"మీరు నా ప్రక్కన వుంటే, దానికేం కొదవ?" అన్నాను తొణక్కుండా.

"శెభాష్! అలాగుండాలి," నా భుజంమీద అవధాని చెయ్యి వచ్చిపడింది, మృదువుగా.

క్షణంసేపు నాలో విద్యుత్తులాంటిది ప్రసరించినట్టయింది. ఆ అనుభూతి అపూర్వం, అనిర్వచనీయం.

అయిదు నిముషాలు ఏవేవో కబుర్లతో గడిచాక—

"ఎల్లుండి అమావాస్య కదూ! మనం ఓచోటికి కెళ్దాం. మాంచి తమాషా చూద్దువుగాని, ఎల్లుండి రాత్రి సరిగ్గా పదింటికి యిక్కడకు రా," అన్నాడు అవధాని.

"అలాగే సర్!" అని అనేసి, ఓ నమస్కారం చేసి, యింటికొచ్చిపడ్డాను, ఆనందంతో తేలిపోతూ.

ఒక వారంరోజుల్లో నాలో ఎంత మార్పు? అవధానిని

కలుసుకోక పూర్వం వచ్చి నా స్థితుడిన్ని, భౌతికవాదిని. కాని, యిప్పుడు దేన్నైనా నమ్మే స్థితిలో వున్నాను. ఈ లోకంలో జరగకూడనిది, అసంభవం అంటూ ఏమీ లేదని పిస్తోంది. ఎడారిలో కమలాలు పండినా, కొండల్లో ఖర్జూరం చెట్లు పెరిగినా ఆశ్చర్యపోను.

రావాల్సిన అమావాస్య రోజు వచ్చింది.

అవధాని చెప్పిన సైనుకు హోటల్ కు వెళ్ళాను. నేను హోటలు చేరుకునేసరికి, అవధాని నా కోసమే యెదురు చూస్తున్నాడు, ఆవరణలో ఓ కార్లో కూచుని సిద్ధంగా.

"నీ కోసమే చూస్తున్నాను. రా! రా! కారెక్కు"

పిలిచాడు ఆయన కారు తలుపు తెరిచి.

నేను కార్లో కూచోగానే, కారు బయలుదేరింది.

"ఎక్కడికండీ ఇలాగ?" అన్నాను కాసేపయాక. అప్పటికి, కారు పట్నం పొలిమేరలు దాటిపోయి, మాంచి స్పీడులో పోతోంది.

"తినబోతూ రుచులడగడం దేనికి? నువ్వే చూస్తా వుగా. మనం తిరిగే ప్రపంచమంత పెద్దదిగానే ఉంటుంది' ప్రేతాత్మల ప్రపంచం కూడా... ఆ ప్రపంచంతోనే మొదటిసారిగా నీకు పరిచయం కాబోతోంది ఇవాళ. ముందుగా ఒక్కమాట... మౌనంగా మాస్తూ కూచోవ డమే గాని నీ అంతట నువ్వుగా యేమీ చెయ్యనని మాట ఇవ్వాలి."

"అలాగే సార్! ప్రామిస్ చేస్తున్నాను," అన్నాను.

అవధాని మౌనంలోకి జారుకున్నాడు నన్ను నా ఆలో చనలకు వదిలి.

అలా దాదాపు రెండు గంటలసేపు ప్రయాణంచేసి ఉంటాం.

"డ్రైవర్ ఇహ ఇక్కడాపు" అన్నాడు అవధాని కారు ఓ చోటకు చేరుకోగానే.

డ్రైవరు కారాపాడు టక్కున.

"దిగు ఇక్కడ" అన్నాడు అవధాని నన్నుద్దేశించి.

కారులోంచి దిగుతూ చూసాను, నేను దిగిన ప్రదేశాన్ని. రోడ్డుకు అటూ ఇటూగానీ, సమీపంలోగానీ, ఏ వూరూ ఉన్నట్టులేదు. అంతటా చిక్కని చీకటి. కారు దీపాల కాంతిలో మాత్రం రోడ్డు కాస్త మేర అవుపిస్తోంది.

అవధాని కూడా దిగి "ఇహ నువ్వు వెనక్కు వెళ్ళు," అన్నాడు డ్రైవరుతో.

డ్రైవరు అవధానికో నమస్కారం చేసి, కారు వెనక్కు త్రిప్పి, పట్నంవైపు వెళ్ళిపోయాడు.

నేనూ, అవధాని చీకటిలో మిగిలిపోయాం.

రెండు నిముషాలు గడిచాక, నక్షత్రాల కాంతిలో, రోడ్డు కాస్త అవుపించడం మొదలుపెట్టింది. ఆకాశంలో మేఘాలు ఉండి ఉంటే, అదికూడా వీలుకాక పోను.

"ఊరు నాడూ కాని చోట, చీకటిలో, అడవిలో దిగామేమిటి సార్? రేపు మళ్ళా ఊరికిపోవడం యెలాగో ఆలోచించారా?" అన్నాను.

నాకు అంతా అయోమయంగానూ, అగమ్య గోచరం గానూ ఉంది.

"నువ్వేం భయపడకు. చీకటిలో నేను బాగా చూడగలను. పురుగు పుట్రా భయంకూడా అక్కర్లేదు నీకు. మనకు పదడుగుల దూరంలో ఉన్న జంతుజాలం మన రాక గ్రహించి పారిపోతుంది. ఇహ, ఇంటికి తిరిగి వెళ్ళడం

అంటావా? ఇప్పుడెలా వచ్చామో, అలాగే వెళ్తాము"
అన్నాడు అవధాని.

ఇప్పుడు మా ప్రయాణం రోడ్డుమీద కాక, ఓ అడవి లోని సన్నని చీలికలాంటి కాలి బాటమీద సాగుతోంది.

"చూడు ఉమాపతీ!" నా ప్రేరణ లేకుండానే అవధాని మాట్లాడ్డం ఆరంభించాడు.

"చెప్పండి సార్!" అన్నాను ఉత్సాహంగా.

"పీలును బట్టి, సదుపాయాన్ని బట్టి, మనుషులెలా పట్నాల్లో విస్తారంగా, పల్లెల్లో చాలా తక్కువగా, కుగ్రామాల్లో అయితే, మరీ పలుచగా ఉన్నట్టు, ప్రేతాత్మలు ముమ్మరంగా తిరుగాడే ఓ స్థలానికి నిన్నిప్పుడు తీసుకెళ్తున్నాను" చెప్పాడు అవధాని.

నేనేం వ్యాఖ్యానించలేదు. "అలాగే!" అంటూ మౌనం వహించాను.

ప్రేతాత్మలు అంటే దెయ్యాలు. అవి యెవరికయినా అగపడినట్టుగా వారు రూఢిగా చెప్పగా నేను వినలేదు. అవు, నేను వాటిని యెన్నడూ చూడలేదు. అలాంటిది, అవధాని, దెయ్యాలు విస్తారంగా ఉండే స్థలాన్ని చూపిస్తానంటున్నాడు.

దెయ్యాలెలా వుంటాయో చూడాలన్న కుతూహలం నాలో కలిగింది.

సుమారు ఓ గంట నడిచేసరికి, అడవి తరిగిపోయి, మైదానం ఒకటి వచ్చింది.

చుక్కలు ప్రసరిస్తున్న ఆకాస్త వెలుగులో అవుపించిన, ఒకటి రెండు తులసి కోటలూ, సమాధుల్ని బట్టి, అది శ్మశానం అని గ్రహించాను.

మరి కాస్త దూరం వెళ్ళాక, మా ముందునుంచి, రెండు నక్కలు జోరుగా, ఎవరో తరిమినట్టు, పరిగెత్తాయి.

అదే సమయంలో నా కాలికేదో తగిలింది. పడిపోబోయాను. కారణం యేమిటో పరిశీలించేసరికి, నా గుండె గుభేలుమన్నది,

కొంచెం కొంచెంగా కెలికిన మట్టిలోంచి పైకి వచ్చి కనిపిస్తోంది, అక్కడ కప్పబడిన శవం తాలూకు చెయ్యి కాబోలు.

ఇందాక మా ముందునించి పరుగెత్తిన నక్కల పనే ఇది అనుకున్నాను.

అలాంటి దృశ్యం అలాంటి వేళలో చూడ్డం నాకు అదే మొదటిసారేమో, నా గుండె ఒక్కక్షణం నిలిచిపోయి, తిరిగి రెట్టింపు వేగంతో కొట్టుకోసాగింది.

నా ఆలోచనలు చదివేసినట్టు "భయపడకు!" అంటూ నా చెయ్యి పట్టుకున్నాడు అవధాని. అదేమిటో మంత్రించినట్టుగా భయం మాయమై, దాని స్థానంలో మొండి ధైర్యం చోటు చేసుకుంది.

"పద, ఆ మామిడిచెట్టు గుబుర్లలో కూచుందాం," అంటూ నన్ను ఓ దిక్కుగా లాక్కెళ్ళాడు అవధాని.

యాంత్రికంగా అతడ్ని అనుసరించాను.

ఇద్దరం ఓ బరువైన కొమ్మమీదకు ఎక్కి కూచున్నాం. మాకు అభిముఖంగా శ్మశానం ఉంది. మా వెనుక దట్టమైన అడివి ఉంది.

రెండు క్షణాలక్రితం, మా సంభాషణవల్ల, చెదిరిన నిశ్శబ్దం మళ్ళీ దట్టంగా పేరుకున్నట్టయింది.

నా రేడియం డయల్ రిస్ట్‌వాచీ చూసుకొన్నాను.

పన్నెండు గంటలు దాటి పదినిముషాలవుతోంది.

కీచురాళ్ళ శబ్దం ఏకబిగిన వినిపిస్తోంది ఇప్పుడు. మధ్య మధ్య గాలికి ఊగే చెట్లకొమ్మల గలగలలు ఉండుండి వికృతంగా అరిచే పిట్టల అరుపులు గుండె ఝల్లుమనిపిస్తున్నాయి.

"చూడటు" అన్నాడు అవధాని, నా తొడమీద చేత్తో పొడుస్తూ.

"ఎటు" అన్నాను, చీకటి తప్ప నాకేమీ అవుపించక పోయేసరికి.

"ఓ ఊరేగింపు అవుపించడం లేదూ?"

"లేదు."

"కాస్త మనస్సు కాన్సెంట్రేట్ చేసి చూడు."

అది మనస్సుని కేంద్రీకరించడం అవుతుందో కాదో నాకు తెలీదుగాని, నాకు తోచిన ప్రయత్నమేదో చేసాను. అయినా, నాకేమీ అగపడలేదు.

ఆ విషయం అవధానికి చెప్పాను.

"ఊహూ! ఇలాగయితే ఎలా నీతో" అంటూ తన రెండు చేతులూ నా తలమీద ఉంచాడు ఓ క్షణం. ఆ మీదట, మెల్లగా నా భుజాలమీద, మెడమీద కాసేపు కదిపి, తటాలున, నా భుజానికీ, మెడకీ మధ్యభాగంలో ఓ చోట ఓ నరం పట్టుకుని గట్టిగా నొక్కాడు.

నా కళ్ళముందు దీపాలు వెలిగినట్టయింది, మరు క్షణంలో.

నాకిప్పుడు మాకు ఎదురుగా ఉన్న మైదానం చివర్న వస్తున్న ఊరేగింపు స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆ ఇప్పుడు అవుపిస్తోంద మీరు చెప్పిన ఊరేగింపు.

ఇంతకూ యేంచేసారు నన్ను?'' అన్నాను, నా మనో నేత్రమేదో తెరుచుకున్నట్టనిపించి.

''మనిషి శరీరంలో తొమ్మిది సైకిక్ సెంటర్స్ ఉంటాయి. ఆ తొమ్మిది కేంద్రాలూ తెరవబడుతుంటే, ఆ వ్యక్తికి ఒకో అమోఘశక్తి సిద్ధిస్తుంది. యోగవిద్య అంటే, యీ సైకిక్ సెంటర్స్‌ని తెరవడమే. ఇప్పుడు నీకు నేను చేసిందేమిటంటే, తాత్కాలికంగా, నిశిత, కేంద్రీకృత, మనోశక్తికి తప్ప అవుపించని ఆత్మలు కనిపించేలా, నీ ఒంట్లోని ఓ సైకిక్ సెంటర్ని కొంచెం తెరిచాను. చూసి ఆనందించు,'' చెప్పాడు అవధాని.

''సార్! నా కనుభవం అయిందికాబట్టి, మీరు చెప్తున్నది నిజమనిపిస్తోంది. ఈ విషయం ఇంకొకరికి చెబితే, డామ్ నాన్సెన్స్ అనరూ!'' అన్నాను, రేపు నేను యీ సంగతులన్నీ చెప్పినా, జనం సులువుగా నమ్మరుసుమండీ, అన్న ఉద్దేశం వ్యక్తపరుస్తూ.

''ఆక్యు పంచర్‌ని నాన్సెన్స్ అని ఎందుకనవూ? చెవితమ్మెలో సూది గుచ్చితే, గుండె జబ్బులు నయమవుతాయా? తొడ చేయి వగైరా కొన్ని భాగాల్లో సూదులు గుచ్చితే, పక్షవాతం కుదురుతుందా? మై డియర్ ఫ్రెండ్! మానవుడి శరీరంలో ఏముందో సమగ్రంగా తెలిసినవారుగాని, తెలుసుకొన్నవారుగాని ఇంకా ఎవరూ పుట్టలేదు. తెలుసుకోవాల్సింది, తెలుసుకొని లబ్ధి పొందాల్సింది ఎంతో ఉంది.''

దాంతో నా నోటికి తాళం పడిపోయింది.

అదే సమయంలో ఊరేగింపు కూడా బాగా దగ్గరయింది. ఆ దృశ్యం చూడ్డంలో మునిగిపోయాను.

ఊరేగింపులోని వాళ్ళు చూడ్డానికి మానవాకారాలతోనే ఉన్నారుగాని, అంత వికృతమైన ఆకారాల్ని, నా ఇరవై ఎనిమిదేళ్ళ జీవితంలో ఎన్నడూ చూళ్ళేదు.

గాల్లోకి లేచిపోతున్నట్టుగా జుత్తు, ఓ ప్రక్కకు కోసుకుపోతున్నట్టుగా ఎగుడుదిగుడుగా మొహాలు, పెదాల దగ్గర వంపులు తిరిగిన కోరలు, వెడల్పాటి నోళ్ళు, కళాయి పోడయిపోయిన అద్దంలో కదులాడే మనుషుల మూర్తుల్లా అవుపిస్తున్నారు వాళ్ళు.

కొన్ని వందల ప్రేతాత్మల మధ్యగా ఓ తెల్లని పల్లకీ. ఆ పల్లకీలో, తన రెండు బుగ్గల్లో రెండు లడ్లు దాచుకొన్నట్టుగా పెద్ద బుగ్గలు, వికృతంగా బానలా వేలాడే పెద్ద బొజ్జమీద, ఊరికినే కదులాడే రొమ్ముభాగం గల ఓ భారీ విగ్రహం ఉంది. తడవతడవకూ ఓ నలుగురు వ్యక్తులు ముందుకొచ్చి, ఆ పల్లకీని తమ భుజాలమీదకు మార్చుకుంటున్నారు. మరో నలుగురు కొత్తవాళ్ళు రాగానే, ఆ నలుగురు తప్పుకుంటున్నారు.

ఈ లోపున ఊరేగింపు వైపుగా ఓ వ్యక్తి పరుగెత్తుతూ అవుపించాడు.

"వాడెవడో తెలుసా? వాడో ప్రేతాత్మ-బ్రతికుండగా అందమైన ఆడవాళ్ళ వెంటబడి అనుభవించాడు. చచ్చాక కూడా వాడి భ్రాంతి తీరలేదు. ఇక్కడకు పదిమైళ్ళ దూరంలో ఉన్న ఓ చిన్న ఊళ్ళో కామాక్షి అనే అందమైన స్త్రీ ఉంది. ఆమెనుపట్టి తన కామదాహం తీర్చుకుంటున్నాడు," చెప్పాడు అవధాని మెల్లగా.

"అది సరేగాని, ఇంతకూ ఆ పల్లకీలో ఊరేగుతున్న వ్యక్తి ఎవరో చెప్పండి. అప్పుడుగాని తతిమ్మా విషయాలు

అర్థంగావు నాకు,'' అన్నాను.

''ఆ పల్లకీలో వ్యక్తి కాలభైరవుడు. ప్రేతాత్మలకు నాయకుడు. ప్రతీ అమావాస్యకు బయలుదేరి, తన వాళ్ళను చూసిరావడం అతనికి అలవాటు. ఇందాక నేను చెప్పిన వ్యక్తి, అతని ముఖ్య వ్యక్తుల్లో ఒకడు. ఈ స్థావరానికి సంబంధించిన వాడు. ఊరేగింపునాడు తన మొహం చూపించకపోతే, తన నాయకుడికి ఆగ్రహం వస్తుందని అతని భయం. అందుకే అంత ఆత్రంగా పరుగెడుతున్నాడు,'' వివరించాడు అవధాని.

''ఈ సంగతి కాలభైరవుడికి తెలీదంటూరా? అయినా తెలుసుకుంటే ఏమవుతుంది?'' అన్నాను, అవధాని చెప్తున్నది ఓ కట్టు కధగా, నేను చూస్తున్నది ఓ కలగా అనుకుంటూ.

''ఓ మైగాడ్! తెలీడమే! వాడ్ని చిత్రహింసలు పెట్టందే వదలడు కాలభైరవుడు. ఇంకో విషయం. మనుషుల్లో జానిసత్వం పోయిందిగాని ఇంకా ప్రేతప్రపంచంలో మాత్రం ఉంది. ప్రేతాత్మలచేత ఊడిగాలన్నీ చేయించుకునే వాళ్ళున్నారు తెలుసునా?''

''అలాగా? మరి, మీ రెందుకు చేయించుకోరు?'' అన్నాను మామ్మూలుగా.

''ఇందాక మన కారు నడిపిన డ్రైవర్ని చూసావా?''

''లేదు,'' అన్నాను ఆశ్చర్యంగా.

''అదో ప్రేతం... అంతేగాదు! అవాళ డోమ్‌లోని బల్బు కూడా బద్దలుకొట్టింది ప్రేతమే!''

అవధాని నా ప్రక్కనే కూచుని మాట్లాడుతున్నాడు మామ్మూలుగాకానీ, ఎందుకో అతన్ని చూస్తుంటే, నా గుండెల్లో వణుకు పుడుతోంది.

అప్పటికి ఊరేగింపు కదిలి, దూరంగా వెళ్ళి కనుమరుగై పోయింది.

"ఇహ పద! వెళ్ళిపోదాం," అన్నాడు అవధాని, కొమ్మమీంచి కిందికి గెంతుతూ, నేను కొమ్మదిగి అతన్ని అనుసరించాను.

కాస్తదూరం వెళ్ళాక, "ఇలారా ఒకసారి నా దగ్గరికి" అని అవధాని అనగానే, అతనికి చేరువగా వెళ్ళాను.

ఇందాకటిలాగే నా మెడమీద చేతులుంచి, ఇందాక నొక్కినచోట నరంమీద నొక్కాడు. నేను మామూలుగా అయిపోయాను. మునపటి చీకటి తప్ప ఇంకేమీ అగపడడం లేదు నాకు.

3

ఈ భౌతిక ప్రపంచం గాక, వేరేగా ఆత్మ ప్రపంచం ఒకటుందని నా మనస్సులో బలంగా నాటింది.

ఇహ; దేవుడూ, పూజలూ, భక్తీ వగైరా ఆధ్యాత్మిక విషయాలు అవధాని ప్రమేయం లేకుండానే, నా మనస్సుని ఆక్రమించుకున్నాయి వాటంతటవే.

ఇప్పుడు నాకు అవధాని సర్వస్వం అయిపోయాడు.

ఓ రోజున సాయంత్రం అవధాని గదికి వెళ్ళేసరికి, అతని సోఫాలో గుడ్డలు చుట్టిన ఓ స్త్రీమూర్తి చెక్క బొమ్మ పడుకోబెట్టి వుంది. దాన్ని తదేకంగా చూస్తున్నాడు అవధాని, సోఫాకు యెదురుగా ఓ కుర్చీలో కూచుని.

రెండు క్షణాలు పోయాక నన్ను చూసి నవ్వాడు.

"నీకు శరీరస్పర్శ అంటే అనుభవం వుందా?" అన్నాడు నా కళ్ళల్లోకి చూసి.

'ఉందీ!' అని నేను చెప్పడానికి నాకు యింకా పెళ్ళి కాలేదు. లోకం దృష్టిలో నేను బ్రహ్మచారినే.

కాని, నాకు ఆడదాని శరీరస్పర్శ అంటే కొత్తేమీ కాదు. అమ్మాయిలంటే పడి చస్తాను. అమ్మాయిల పొందు కోసం ఎంత ఖర్చయినా పెడతాను. అది నా వీక్ నెస్!

తాజాగా యిప్పుడు రంజని అనే అమ్మాయికోసం ప్రయత్నం సాగిస్తున్నాను.

రంజనిని సినిమాహాల్లో చూసిన మొదటిరోజునే, ప్రయత్నించి ఆమెను ఎలాగయినా పొంది తీరాలని నిశ్చయించుకున్నాను.

అయితే; రంజని, శేఖరం చెల్లెలని తెలియవచ్చింది. స్నేహితుడు చెల్లెలు గదా తప్పు చేస్తున్నానేమో అని మొదట మధనపడ్డా, చివరకు ఆమె వాడికి స్వంత చెల్లెలు కాదులే అని తృప్తిపడి, రంజని నా స్నేహితుడి చెల్లెలన్న విషయాన్ని మనసుమీంచి తుడిచేశాను శాశ్వతంగా.

రంజనిని లొంగదీసుకునే ప్రయత్నంచేస్తున్న సమయం లోనే, శేఖరం నన్ను తీసుకొచ్చి అవధాని ప్రభావంలో పడేశాడు.

"ఏం?...నీకు స్త్రీ శరీరస్పర్శ అంటే అనుభవం వుందా?" అవధాని రెట్టించగానే, నా ఆలోచనా ప్రపంచంలోంచి ఊడిపడి, ప్రస్తుతంలోకి వచ్చాను.

"ఉంది సార్!" అన్నాను తలవంచుకుని సిగ్గుపడుతూ.

"అయితే ఆ బొమ్మను ఓసారి ముద్దుపెట్టుకుని, ఎలాగుంటుందో చెప్పకూడదూ?" అన్నాడు అవధాని.

తుళ్ళిపడి "ఏమిటీ?...దాన్ని ముద్దు పెట్టుకోవడమా? అదేమిటి సార్ అలాగంటారు? అయినా యెందుకు సార్ బొమ్మను ముద్దు పెట్టుకోవడం?" అన్నాను నేను.

"ఎందుకా? నీకే తెలుస్తుంది? ఓసారి ముద్దుపెట్టుకుని చూస్తే, యేం పోయింది నీకు?" అన్నాడు అవధాని పంతంగా.

అవధాని అలా అనేసరికి, ఇహ కాదనలేకపోయాను. చెక్క బొమ్మ ఉన్న సోఫా దగ్గరకు వెళ్ళాను. మోకాళ్ళ మీదకు వంగి కూచుని దానివైపు చూసాను. నిర్మలంగా వుంది.

చట్టున వంగి ముద్దుపెట్టుకున్నాను, ఆ బొమ్మను.

కలిగిన ఫీలింగ్ చూసి దిగ్భ్రాంతి చెందాను. ఎంచేతంటే, ఆ ఫీలింగు యేమిటో అనుభవంవల్ల తెలుసు. అది నిండుగా, బలిష్ఠంగా గోపురంలా యెదిగిన ఓ యువ్వని స్తనం ముద్దు పెట్టుకొన్నప్పటి ఫీలింగ్.

కాని, అది గరుగ్గా, చెక్కలా తగలడానికి బదులు, యేమిటీ విచిత్రానుభూతి?

నా అనుమానం తీరక మెల్లగా వంగి, మళ్ళీ ముద్దు పెట్టాను.

మళ్ళా అదే వింత అనుభూతి?

నా మొహం, నిండుగా యెదిగిన ఓ స్త్రీ రొమ్ముల మధ్య లోయలో కూరుకుపోయినట్టయింది.

అలానే రెండు క్షణాలు ఉన్నాను. ఆ అనుభూతి మాయలేదు.

నా వెనుక గట్టిగా అవధాని నవ్వు వినబడింది. తుళ్ళి పడి చట్టున లేచి నిలబడ్డాను.

"మీరేవో మెస్మరిజం చేసారు సార్! ఏమిటీ తమాషా?" అన్నాను నవ్వి.

అవధాని నవ్వు ఆపుకుని, "ఈ బొమ్మను ఒక రోజుకు

నీకు కానుకగా ఇస్తాను. తీసుకెళ్ళి అది అందించే ఆనందం కూడా చవిచూడు" అన్నాడు.

నాకింకా ఆశ్చర్యం వేసింది. ఆ బొమ్మ పురుషుడిని ఆనందపరచగలదా?

నేను మాట్లాడలేదు. అర్థశంతంగా అతని మొహంలోకి చూస్తూ ఉండిపోయాను.

"సిగ్గుపడకు. తీసుకో!" అంటూ తక్షణం ఆ చెక్క బొమ్మను ఓ అట్టపెట్టెలో పెట్టి నా చేతిలో ఉంచాడు అతధాని.

గప్ చిప్ గా పెట్టె పుచ్చుకుని, అతనికి థేంక్స్ పారేసి యింటికొచ్చి పడ్డాను.

"ఏమిట్రా ఆ పెట్టె?" నా చేతిలో ఉన్న పెట్టెచూసి అమ్మ కుతూహలంగా అడిగింది. అమ్మకేదో చెప్పి, భోజనం ముగించి, నా గదిలోకి పోయి తలుపులు మూసుకొన్నాను.

పెట్టెలోంచి చెక్కబొమ్మను వెలుపలికితీసి మంచం మీద ఉంచాను. ముద్దు రిపీట్ చేసాను. అదే అనుభూతి! అదే ఫీలింగ్! నా ఒంట్లో రక్తం కోరికతో ఉరకలు వేయసాగింది.

గదిలో దీపం పెద్దగా వెలుగుతోందన్న విషయం గుర్తుకొచ్చింది. కొన్ని పనులు చీకట్లో చేస్తేనే బావుంటాయి. లైటార్పేసాను. నా మంచాన్ని సమీపించాను.

నా గుండాగి నట్టయింది.

మంచమీద చెక్కబొమ్మకు బదులు, నగ్నంగా ఓ స్త్రీ పడుకుని ఉంది.

"ఎవరది?" అన్నాను మెల్లగా. జవాబుగా గలగల నవ్వు మాత్రం వినిపించింది.

నేను సందేహిస్తూ నిలుచున్నాను, యింకేం మాట్లా డాలో తెలీక, చొరవ తీసుకునే ధైర్యంలేక.

మంచంమీది ఆకారం కదిలి నాకు చేరువగా వచ్చింది. తన రెండు చేతులతో నా శిరస్సుని అందుకుని, తన గుండెల కదుముకుంది బలంగా.

అదే ఫీలింగ్! చెక్కబొమ్మను ముద్దుపెట్టుకొన్నప్పటి అనుభూతి ఇదే! ఆ స్త్రీ యీమే!

అవధాని తన కోర్కెలు తీర్చుకోవడానికి అమ్మాయి లను యీ విధంగా రప్పించుకుంటాడేమోనని, ఊహిం చాను.

తన గుండ్రని అవయవాలకు ఆమె నన్ను గట్టిగా అదుముకుంటుంటే, ఇక ఆగలేకపోయాను.

రెచ్చిన తమకంతో, ఆమెను గాఢంగా కౌగిలించుకుని, మంచంమీదకు దొర్లాను.

4

రాత్రంతా కమ్మనిస్వప్నకలగా కరిగిపోయింది—

తెల్లవారేక చూద్దునుగదా, నా ప్రక్కలో చెక్క బొమ్మ మాత్రమే మిగిలి ఉంది.

రాత్రి అపూర్వమైన అనుభూతుల్ని అందించిన ఆ బొమ్మను చూడగానే నవ్వొచ్చింది నాకు.

హుషారుగా మంచంమీంచి లేవబోయాను. కాని, నడుం పట్టినట్టయింది. ఒంట్లో నీరసంగా ఉన్నట్టు అనిపిం చింది.

ఎంతయినా అంత జోరు పనికిరాదు. విడవకుండా అన్నిసార్లు రతిలో పాల్గొంటే యేమవుతుంది? నవ్వు కున్నాను.

మంచం దిగి, గది బయటకు వచ్చాను కాలకృత్యాలు తీర్చుకోవడానికి.

కాఫీ గ్లాసు అందిస్తూ, "ఏమిట్రా అలాగున్నావు? మొహం అదీ పీక్కుపోయీ... పది లంఖణాలు చేసినట్టున్నావు" అంది అమ్మ ఆశ్చర్య ముద్ర మొహంమీద కనబరచి.

"అలాగుటమ్మా!" అంటూ బయటకు మాట్లాడి, కాఫీ త్రాగి, వెళ్ళి అద్దంలో చూసుకొన్నాను నా మొహం.

మొహం కాస్త చిక్కినట్టుగా ఉన్నమాట నిజమే గాని, రాత్రంతా మెలకువగా ఉండి, నరాలకు విశ్రాంతి యివ్వకపోతే_ యేమవుతుంది మరి? అనుకున్నాను.

మళ్ళా నా మనస్సు చెక్కబొమ్మ వైపుకు లాగడం ఆరంభించింది.

తక్షణం నా గదిలోకి దూరి కోరిగ్గా చెక్కబొమ్మను ముద్దుపెట్టుకున్నాను.

కాని__ కాని... యేమిటిలాగుంది?

గతరాత్రి అనుభవంలేదు. కేవలం చెక్కబొమ్మను ముద్దుపెద్దుకొన్నట్లుగానే ఉంది.

క్షణం నిలవలేకపోయాను. చెక్కబొమ్మను పెట్టెలో పడేసి, అవధాని గదికి పరుగెత్తాను. జరిగింది అవధానికి చెప్పాను.

ఆయన నవ్వి, "ఆల్ రైట్! ఆ టేబిలు మీదుంచు ఆ పెట్టెని" అన్నాడు.

పెట్టెని టేబిలుమీద ఉంచుతూ, "ఆ అనుభవాన్ని శాశ్వతంగా నాది చెయ్యలేరా సార్?" అన్నాను.

"నో! నో! ఒక్కరోజు కోసమే తమాషాకు అలా

చేసాను. ప్రేతాత్మల్ని ఉంపుడుగత్తెలగా కూడా వాడుకో వచ్చని నీకు చూపించాలనుకున్నాను. చూపించాను. అయినా, ఆ అనుభూతిని పెర్మనెంట్ చెయ్యాలంటే చాలా తతంగమవుతుంది.''

''అయినాసరే, ఆ అనుభవం, ఆ అప్సరస శాశ్వతంగా కావాలి'' అన్నాను ప్రాధేయపూర్వకంగా.

''అలా చెయ్యాలంటే, ఆ ప్రేతాత్మతో నీవు కమ్యూనికేట్ చేసేలా చెయ్యాలి. చాలా కష్టమైన పని'' అన్నాడు అవధాని అయిష్టంగా.

''అలాగనకండి సార్! ఎలాగయినా సరే, ఆమె నాకు కావాలి. ఆ పొందు నాకు దక్కదనుకుంటే, నా గుండె పగిలిపోతుంది,'' అన్నాను ఆవేదనగా.

అవధాని ఓ క్షణం ఆలోచించి ''ఆల్ రైట్! ఇవాళ రాత్రి పన్నెండుగంటలకి యిక్కడకు నా గదికి రా. ఆ ప్రేతాత్మతో నువ్వు మాట్లాడి, నీతో సాహచర్యం చేసేలా చేస్తాను'' అన్నాడు.

అవధాని మాటలు నామీద అమృతవర్షం కురిపించాయి.

''థేంక్యూ సార్! థేంక్యూ వెరీమచ్!'' అవధాని చెయ్యి పుచ్చుకుని, చెయ్యి నొప్పిపుట్టి అరిచేంతవరకూ ఊపేసాను.

5

అవధాని చెప్పినట్టుగానే, రాత్రి పన్నెండు గంటలకు అతడి గదికి వెళ్ళాను.

నిత్యమూ సూటులో తప్ప అవుపించని అవధాని యిప్పుడు ఒక్క దోవతి మాత్రం కట్టుకుని ఉన్నాడు.

నుదుట ఎప్పటిలా ఎర్రని కుంకుమబొట్టు పెట్టుకున్నాడు. కాంతివంతంగా మెరిసే నుదుటిమీది ఆ ఎర్రబొట్టు, తూర్పున అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబంలా ఉంది.

గదిలో లైట్లు పూర్తిగా తీసివేయబడ్డాయి. అయితే, గది మధ్యలో వెలిగించిన మట్టి ప్రమిదల కాంతి మాత్రం తమాషాగా అలుముకుని, విచిత్రమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది.

నేలమీద ఉండే తివాసీ చుట్టబడి, గదిలో ఓ మూలకు నెట్టబడింది.

గది మధ్యలో తమాషా అయిన ముగ్గులు, వాటిమధ్య చిన్నటి చెక్కబొమ్మ, వెలిగించిన మట్టి ప్రమిదలు, కుంకుమ, పసుపు, అక్షింతలు వగైరా పూజా ద్రవ్యాలున్నాయి.

"కరెంటు లేదా గురువుగారూ?" అన్నాను, పెద్ద దీపాలు లేకపోవడం నాకు నచ్చక.

"లేకేం. ఉంది. కాని, అది పనికిరాదు. అందుకే తీసేసాను. అలా బాత్‌రూంకి పోయి చేతులూ, కాళ్ళూ కడుక్కునిరా" అన్నాడు అవధాని.

తిన్నగా బాత్‌రూంకి పోయి, అవధాని చెప్పినట్టుగా, కాళ్ళూ, చేతులూ కడుక్కుని వచ్చాను.

పొడి తువ్వాలుతో కాళ్ళూ, చేతులూ తుడుచుకుని సిద్ధంగా నిల్చోగానే, "అలా కూచో, యీ ముగ్గుకు ఎదురుగా" అన్నాడాయన.

ఆయన చెప్పినట్టుగానే పోయి కూచున్నాను. నాకు అటూ యిటూ ఊదొత్తులు వెలిగించి స్టాండుల్లో వుంచాడు. నా నుదుట కుంకుమ బొట్టు ఉంచి "కళ్ళు మూసుకుని నా మీద కేంద్రీకరించు నీ మనస్సుని... తెలిసిందా?... నేను

తెరిచి చూడమన్నప్పుడు, మాట్లాడినప్పుడు మాత్రం కళ్లు తెరిచి మాట్టాడు యేం?'' అన్నాడు.

నేను తలాడించి, అతడు చెప్పిన ప్రకారమే చేసాను.

మొదట నా కళ్ళ ముందు చీకటితెర దట్టంగా అవుపించింది. ఆ తరువాత మెల్ల మెల్లగా, ఆ తెర పల్చనై, చివరకు అదృశ్యమై, దాని స్థానంలో ఓ కాంతి పుంజం నిలిచింది.

అంతసేపూ అవధాని మొహం నా ఊహాలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించాను గాని, సఫలుడ్ని గాలేక పోయాను.

అవధాని ఏవేవో మంత్రాలు చదువుతున్నాడు. మధ్య మధ్య హుంకరిస్తున్నాడు. అరుస్తున్నాడు.

క్రమంగా నా కళ్ళ ముందరి కాంతిపుంజంమీద నల్లని నీడలేవో కనబడసాగాయి.

ఏమిటా నీడలు? అవి స్పష్టంగా కనిపిస్తే బావున్ననిపించింది.

చివరకు ఓ ఆకారం నా కళ్ళముందు నిలబడింది.

ఆ ఆకారం అంత వికృతమైందీ, భయంకరమైందీ, జుగుప్సాకరమైందీ నా జీవితంలో చూళ్ళేదు. ఎవరయినా నన్ను కనీసం ఊహించమన్నా, ఊహించలేను. ఆ ఆకారం మొహం అంతటా లెక్కలేనన్ని ముడుతలు. ముక్కు సన్నగా పొడుగ్గా వుండి, కొన నోటిమీదకు వంగింది. పెదాలు మొద్దుగా ఎర్రగా వున్నాయి. జుట్టంతా చింపిరి చింపిరిగా గాల్లోకి లేచివుంది. దళసరి, పొడుగాటి సంచుల్లా వున్నాయి ఆమె స్తనాలు.

కొద్ది క్షణాలుండి ఆ దృశ్యం మాయమైంది.

అదే క్షణంలో "ఇహ కళ్ళు తెరిచి చూడు" అన్న అవ ధాని మాటలుకూడా విన్పించాయి. కళ్ళు తెరిచాను.

గదిలో నేనూ, అవధానే గాకుండా, యింకో వ్యక్తి కూడా వున్నట్టు ఫీలయ్యాను.

ఎవరా వ్యక్తి?

నా కళ్ళు అప్రయత్నంగానే గదిని చుట్టివచ్చాయి.

"మరీ అంత సిగ్గెందుకు మాయా? ... ఇలారా ... కూచో" అన్నాడు అవధాని, తనకు దూరంగా నేలమీద తట్టుతూ.

మొదట కిలకిలమంటూ నవ్వు విన్పించింది. ఆ తర్వాత, నాకు ఎదురుగా, గోడవారగా ఉన్న సోఫా మసకగా అవుపించడం ఆరంభించింది.

ఆ నవ్వు నాకు బాగా గుర్తు. ముందర రాత్రి నన్ను స్వర్గసౌఖ్యాల్లో ముంచి తేల్చిన అప్సరసదే!

రెండు క్షణాలు గడిచేసరికి, చిత్రకారుడు ఓ చిత్రాన్ని రేఖలుమాత్రం గీసి వదిలేసినట్టుగా, ఓ స్కెచ్ అవుపించింది గాల్లో. ఆ స్కెచ్ మధ్యనుంచి, అవతలివైపున్న సోఫా, గోడ మొదలైన ఆవైపు వస్తువులు మందంగా అవుపిస్తున్నాయి.

ఎవరీ గాజుబొమ్మ?

"మరీ అలా కనీ కన్పించనట్టుగా యేమిటి? పూర్తిగా కనిపించు," అన్నాడు అవధాని.

అప్పుడు పూర్తిగా అవుపించిందామె.

ఓ మైగాడ్! ఏమి అందం? పల్చని పొరలాంటి పాల తెలుపు చీరలోంచి, ఆమె సుంద్రదని అవయవాలు, యౌవనం, అందం, రంగరించుకొన్నట్టుగా, మిసమిసలాడుతూ,

పిటపిటలాడుతూ అవుపిస్తున్నాయి. నిజంగా స్వర్గంనుండి దిగివచ్చిన దేవతలా వుంది.

నా నరాల్లో రక్తం నయాగరా దూకుడు ఆరంభించింది.

"నీకు వేరేగా పరిచయం చెయ్యక్కర్లేదనుకో. ఇతని పేరు ఉమాపతి. అందం అంటే పడి ఛస్తాడు. ఆనందం కోసం ఎంతటి సాహసాలు చెయ్యమన్నా, ఎన్ని కష్టాలు ఎదుర్కోమన్నా ఎదుర్కొంటాడు. ఇతనికి నీతో స్నేహం కావాలంట. ఉంటావా?" అడిగాడు అవధాని.

ఆమె యేం జవాబిస్తుందో అని నా గుండె గుబగుబలాడిపోయింది ఒక్క క్షణం. ఆత్రంగా ఆమె మొహం లోకి చూసాను. ఆమె తన పెద్ద కళ్లెత్తి, నా గుండెల్లోకి చూసి గలగల నవ్వింది.

ఆ నవ్వుకు అర్థం నాకు తెలుసు. ఆనందం పట్టలేక నా గుండె బద్దలవుతుందేమోనని భయపడ్డాను.

"సరే! ఇష్టమేనన్నమాట. అయితే, అతడు నిన్ను పిలవగానే కనపడాలి. రావాలి. అతడి సరదా తీర్చాలి. ఏమంటావ్?" అడిగాడు అవధాని.

ఆమె మళ్ళా అందంగా గలగలా నవ్వింది.

"వెల్! మిస్టర్ ఉమాపతీ! మాయ, ఇకముందు నీది... పిలిస్తే వస్తుంది..., మాటాడుతుంది...నీ కోరిక తీరుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, నిన్నొదిలి యిహముందు వుండదు" అని నాకు చెప్పాక, ఆమెవైపు తిరిగి, "ఇహ నువ్వెళ్ళొచ్చు. ఫో!" అంటూ గట్టిగా అరిచాడు అవధాని.

అంత అందమైన స్త్రీని అంత నిర్దాక్షిణ్యంగా అవధాని కసరడం చూసి నా మనస్సు చివుక్కుమన్నది.

అయితే, నాలో యే మూలో, ఓ అందమైన అమ్మా

యితో అవధాని పొందు కూర్చాడే అన్న కృతజ్ఞతా భావం దృఢంగా వుంది కాబట్టి, ఆ విషయం నేను పట్టించుకోలేదు.

ఆమె నేను చూస్తుండగానే, గాల్లో కరిగిపోయింది. ఆమె అదృశ్యమయ్యేసరికి నా మనస్సు బాధగా మూలిగింది.

నన్ను ముగ్గుల ముందరనించి లేవమని చెప్పి, తను లేచి, లైటు వేసాడు అవధాని.

ముగ్గుల మధ్యనుండి చెక్క బొమ్మను తీసి, పెట్టెలో పెట్టి నా చేతికిస్తూ, "ఈ బొమ్మ ఇక నీ దగ్గరున్నంతవరకు ఆ యువతి నీకు బానిస. నీవు పిలిచినప్పుడల్లా వస్తుంది. నీ కోర్కెలు తీరుస్తుంది," అంటూ నవ్వాడు అవధాని.

6

అవధానిదగ్గర సెలవు తీసుకొని, త్వరత్వరగా యింటి కొచ్చాను.

వేళగాని వేళ యెక్కడికో వెళ్ళొచ్చి, తలుపు తట్టి, తన నిద్ర పాడు చేసినందుకు, అమ్మ నన్ను తిట్టింది. కాని, ఆమె తిట్లను పట్టించుకునే స్థితిలో లేను నేను.

తిన్నగా నా గదికి పోయి, లైటార్పి, మంచంమీదకు చేరుకొన్నాను. చెక్క బొమ్మను అట్టపెట్టెలోంచి తీసి దిండుక్రింద పెట్టాను.

"మాయా!...మాయా!" పిలిచాను మెల్లిగా మంచం మీంచి.

మరు క్షణంలో, ఆమె తన బరువైన వక్షాల్ని నా గుండెలకేసి అదుముతూ, నల్లని మబ్బులాంటి తన జుత్తుతో నా మొహాన్ని కప్పేసి, గాఢంగా ముద్దు పెట్టుకుంది.

నా చేతులకే కళ్ళున్నట్టుగా, ఆమె వంపులమీద కదులుతూ, యెత్తులమీద ఆడుతూ, ఆమె అందాన్ని ఆనందించసాగేయి నా చేతులు.

ఇట్టే తెల్లారిపోయింది.

మాయకు సమయాసమయాలు తెలిసినట్టుంది. మాయమైపోయింది, రాత్రి గడపిన మధురక్షణాలు జ్ఞాపకాలుగా మాత్రం మిగిల్చి.

హుషారుగా మంచం దిగబోయాను. కాని, నడుం పట్టేసింది. మొణుకులు కొయ్యముక్క లయిపోయినట్టుగా అన్పించింది.

"ఛీ! ఛీ!...ఒక్క రాత్రికేనా యింత డీలా పడిపోవడం?" నాకు నేను జవాబు చెప్పుకుని, గది వెలుపలికి వచ్చాను, కాలకృత్యాలు తీర్చుకోవడానికి.

"ఏమైందిరా నీకు ... ఏమిటిలా వున్నావు?" అమ్మ గట్టిగా అరిచింది, స్నానాల గదికి పోతున్న నన్ను చూసి.

"ఏమీ లేదమ్మా! ఒంట్లో కాస్త నీరసంగా వుందంతే, ఎందుకలా అయిపోతావ్?" కసిరాను అమ్మను.

"అది కాదురా!" అంటూ యింకా అమ్మ యేదో అనబోయింది.

"ఏదికాదు...నా మానాన్న నన్ను వుండనీండి. నన్ను విసిగెత్తించకండి," యిల్లు లేచిపోయేలా పెద్ద కేకేసాను.

అమ్మ నోరు టక్కున మూత బడిపోయింది. నా వైపు వింతగా చూసి, కళ్ళల్లో నీళ్ళు తెచ్చుకుని వెళ్ళిపోయింది.

నా కోపంచూసి నాకే ఆశ్చర్యమేసింది. మరుక్షణంలో అమ్మను బాధపెట్టానన్న విషయం కత్తిలా కోసింది నా మనస్సును సన్నగా.

అయితే, ఆరోజు తర్వాత, ఆ బాధా కలగడం మానే సింది.

మాయతో కాపురం పెట్టిన నా ప్రత్యేక ప్రపంచంలో నాకేమీ తెలిసిరావడం లేదు.

అక్షరాలా అవధాని చెప్పినట్టుగా మాయ నన్నువిడిచి ఉండడంలేదు. నేనుకూడా ఆమె లేకుండా ఒక్క క్షణం నిలవలేకపోతున్నాను.

అయితే నా ఒంట్లో శక్తి తరిగిపోతోంది. కాళ్ళు పీకుతున్నాయి. నడుం లాగుతోంది. ఒక్కోసారి ఒళ్ళు తూలిపోతోంది కూడా.

కాని, మాయను అనుభవించాలన్న కోరికమాత్రం తరగడంలేదు. ఆమెతోటి కలయిక తీరని దాహం అయింది.

7

ఆరోజు నాకు చాలా నీరసంగా ఉంది ఒంట్లో. మంచంమీంచి తిరగలేకపోయాను.

అదేమిటో, నేను యేం తింటున్నా, ఎంత తింటున్నా, ఒంటబట్టడం లేదో యేమో, రోజురోజుకీ నా బలం తగ్గిపోతున్నట్టనిపించింది.

ఉదయం పదిగంటలవుతోంది. కిటికీలోంచి యెండ గదిలోపడి తమాషాగా ఆడుకుంటోంది నేలమీద.

మాయ నాకు చేరువగా, తలదగ్గర కూచుంది. ఆమె వేళ్ళతో చిత్రంగా ఆడుకుంటున్నాను.

కాస్త తలవంచి చూస్తే, ఆమె పైటక్రింద దాగున్న పచ్చని పసిడి ముద్దల్లాంటి రొమ్ము లవుపిస్తున్నాయి. పైన, కన్నిస్తూ, ఊరిస్తూ, సవాలు చేస్తూ రమ్మంటున్నాయి మాయ మత్తుచూపులు.

"అలా చూస్తుండు. నాలుగు రోజులు భీముడి తిండి తినేసి నీ పని బడ్తాను" అంటున్నాను నేను, నా నీరసానికి విచారిస్తూ.

"ఏం పనిబడ్తారు? పదిరోజులకే యిలా అయిపోయారు. ఏం మగాళ్ళో మీరు?" అంటూ కైపుగా నవ్వుతోంది.

మాయను చూస్తుంటే పిచ్చెక్కిపోతోంది నాకు. అమాంతం మీదబడి, ఆ అందాన్ని నలిపేసి, చిత్తు చేయాలని వెర్రికోరిక.

"అదిగోనండీ ... అదీ వరుస... వాడిలోవాడు అలా మాట్లాడుకుంటాడు గదిలో కూచుని," అమ్మ మాటలు వినగానే తలత్రిప్పి చూసాను.

అమ్మతోపాటుగా డాక్టరు రామారావుగారు వున్నారు.

"నమస్కారం సార్!" అన్నాను నవ్వి.

"ఏమిటోయ్! ఉమాపతీ! గుండులాగుండేవాడివి... ఇలాగయిపోయావేమిటోయ్?" అన్నాడు డాక్టరు రామారావు ఆశ్చర్యం ఒలకబోస్తూ, నా మంచంమీద కూచుని.

నా ఒళ్ళు భగ్గున మండింది.

నాకేమయిందని, ప్రతీ వెధవా యీ ప్రశ్న వేయడం? ఏదో ఒంట్లో కాస్త నీర్సంగా వుంటే, ఎనీమియాతో చచ్చిపోతున్నట్టు ఎందుకీ జాలి అరుపులు?

డాక్టరు దగ్గరకు రమ్మంటే, నేను రానంటూ మొరాయించినందుకు, డాక్టర్నే యింటికి పిలిపించినందుకు అమ్మ మీద కూడా కోపం వచ్చింది నాకు.

అయినా, నా కోపాన్ని నిగ్రహించుకొన్నాను. ఆయన మా ఫామిలీ డాక్టరు. నేనంటే ప్రత్యేకాభిమానం.

"ఏమీలేదు సార్! ఏదో కాస్త నీర్సంగా ఉంది

ఒంట్లో. దానికే మావాళ్ళు ఈడ్చుకొచ్చారు ఇక్కడికి" అన్నాను మొహంమీదకు బలవంతాన తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

"'శాస్త్ర నీర్సం' అంటూ అంత మామ్మూలుగా అంటా వేమిటోయ్. నీ మొహం చూసుకొన్నావా అద్దంలో యెప్పుడయినా?" అన్నాడాయన ఎంతో సీరియస్‌గా, ఆందోళనతో.

"చూసుకున్నానండి... కొంచెం చిక్కినట్టుగా ఉన్నాను. అంతే!" అన్నాను, అప్పటికే నా నిగ్రహాన్ని దాటి వస్తూన్న కోపాన్ని పళ్ళమధ్య బిగబట్టి.

"కొంచెం అంటావేమిటోయ్... బాగా వుంటేను... అనగూడదుగాని, ఇంకో రెండు రోజుల్లో హరీమనేవాడిలా ఉన్నావు," అన్నాడాయన యింకా.

అప్పటికి నా సహనం హద్దులు దాటింది.

"డాక్టర్ మీ గుణం చూపించుకున్నారు మొత్తం మీద. పేషెంట్ ఎవడు దొరుకుతాడా, వాడికేదో భయంకరమైన రోగముందని హడలగొట్టి, నాలుగు డబ్బులు చేసుకుందామా అని చూస్తున్నారు," అన్నాను కోపంగా, పళ్ళు కొరికి, పిడికిళ్లు బిగించి.

"డాక్టర్ గారూ! మీరు యింకేమీ మాట్లాడవద్దు. ఆ విషయం మీకు ముందే చెప్పాను. ఏ క్షణంలో ఏ అఘాయిత్యం చేస్తాడో అని హడిలి ఛస్తున్నాం. దయచేసి ఊరుకోండి" అంటూ డాక్టరుని బ్రతిమాలుకుంటున్నది అమ్మ.

డాక్టరుగారి నోరు మూతబడింది దాంతో.

కాసేపు నా నోరు తెరిపించి, కళ్ళు సాగదీసి, స్టెత స్కోపుతో గుండెమీద ఎక్కడెక్కడో వుంచి చూసి "సివియర్ ఎనీమియా. రక్తం ఏమీ లేదు ఒంట్లో. బలవర్ధక ఆహారాలు, రక్తపుష్టినిచ్చే మందులు వాడాలి" అంటూ ఓ ప్రిస్క్రిప్షన్ రాసేసి అమ్మ చేతిలో పెట్టి, మందులు వాడే విధానం గడగడా చెప్పేసి, వెళ్ళిపోయాడు డాక్టరు యింకో మాట మాటాడకుండా.

డాక్టరు రామారావు వెళ్ళిపోయాక, ఓ పెద్ద నిట్టూర్పు విడిచాను, న్యూసెన్స్ వదిలినందుకు.

అయితే, అంతటితో న్యూసెన్స్ వదలలేదు. ఎక్కువ కాసాగింది. బంధువులొచ్చి పలకరించసాగారు.

అందరికన్నా పెద్ద న్యూసెన్స్, మా వీధివాళ్ళూ, యిరుగు పొరుగులవాళ్ళూ అయిపోయారు.

ఏదో పనిమీద మా యింటికి రావడం, వచ్చినవాళ్లు ఊరుకోక పనిగట్టుకుని నన్ను చూసి "దీపంలా ఉన్న కుర్రాడు ఆరిపోయిన దివిటీలా ఎలా అయిపోయాడో", అంటూ సానుభూతి కబుర్లు చెప్పి వెళ్ళిపోవడం ఓ తంతుగా తయారయింది.

ఇహ, మా వీధి కుర్రకారు సంగతి సరేసరి. నా గది కిటికీ వద్దో, వీధి ద్వారం వద్దో మూగి నన్నో ఓ వింత జంతువులా చూస్తూ నిలబడ్డం ఏవేవో వ్యాఖ్యానాలు చెయ్యడం.

వాళ్ళందరూ మాట్లాడుకునే దొకటే: నాకు మద పిచ్చి యెత్తింది. ఎవరో అమ్మాయి నా ప్రక్కన ఉన్నట్టుగా నాలో నేను మాట్లాడుకుంటాను. నవ్వుతాను. ప్రవర్తిస్తాను, అని.

లోకమంతా ఏకమై నా గురించి ఏం కూసినా, ఏమీ అనుకోకపోదునుగాని, నాకు పిచ్చి పట్టిందనీ, అది క్షణ క్షణానికీ ముదిరిపోతోందనీ, మా అమ్మనే నా గురించి అనడం మొదలుపెట్టేసరికి, నా రక్తం మరిగిపోయింది.

8

అగ్గిలో ఆజ్యం పోసినట్టు, పుండుమీద కారం చల్లి నట్టు, ఓ రోజున యిద్దరు వ్యక్తులు వచ్చారు నా గదికి. వాళ్ళిద్దరూ, పొడవుగా, బలిష్ఠంగా, ముష్కరుల్లా ఉన్నారు.

ఆ ముష్కరులతో నేను యేదో మాట్లాడేలోపల, వాళ్ళిద్దరూ నన్ను గట్టిగా పట్టుకుని బంధించారు. ఓ రిక్షాలో పడేసి, సైకియాట్రిస్ట్ సుందర్రావు దగ్గరకు తీసుకు వెళ్ళారు. నిజం చెప్పొద్దూ, సుందర్రావు నాకో సైకిక్ కేసులా అవుపించాడు.

"నాకేం పిచ్చిలేదు. నావల్ల ఎవరికీ యే ప్రమాదమూ లేదు. నన్ను బంధించి తీసుకురావాల్సిన అవసరమే మొచ్చింది. అయ్ డిమాండ్ యువర్ ఎక్స్ప్లనేషన్" అని నేను సీరియస్‌గా, ఆవేశంగా అంటే పగలబడి నవ్వాడు సుందర్రావు అయిదునిముషాల సేపు.

ఆ తరువాత టక్కున సీరియస్ అయిపోయి "నువ్వంత డేంజరస్ కాపోతే, నీకే పిచ్చంటూ లేకపోతే,నిన్ను పట్టి తెమ్మని, నే నెందు కడిగానంటావ్? మీ పేరెంట్స్ అందుకు ఎందు కంగీకరించా రంటావ్? అయ్ వాంట్ యువర్ పాజిటివ్ రిప్లై" అన్నాడు కళ్ళు పెద్దవిచేసి, పళ్ళు బయటకుపెట్టి, కాట్లాటకు దిగిన పిల్లిలా.

అలా మాట్లాడేవాడితో నేనేం వాదించను? అప్పటికే

బాగా అలసిపోయానేమో, శరీరం విశ్రాంతికోసం తపించి పోతోంది. మౌనం వహించాను.

నన్ను ఓ గదికి తీసుకెళ్ళి, అక్కడున్న ఒకేఒక మంచంమీద పడుకోమన్నాడు.

నా మొహానికి పైన ఒకేఒక బల్బు వెలుగుతోంది. నాలాగే అది ఒంటరిగా, నిస్సహాయంగా వున్నట్టు అనిపించింది, దానివైపు చూస్తుంటే.

దానివైపే చూసి, అంకెలు ఒప్పజెప్పమన్నాడు సుందర్రావు.

అతడు చెప్పినట్టుగానే చేసాను విధిలేక; తొందరగా అతడి న్యూసెన్స్ తప్పుతుందన్న ఆశతో.

అంకె యిరవై రెండువరకూ చెప్పినట్టు గుర్తు.

ఆ తరువాత స్పృహ లేదు నాకు.

ఎంతసేపు ఆ స్థితిలో వున్నానో నాకు తెలీదు. కాని, సుమారు రెండు మూడు గంట లుండవచ్చునని నా అంచనా.

సుందర్రావే ఏవేవో ప్రశ్నలు వేసినట్టు, వాటికి ఏదో జవాబు చెప్పినట్టుకూడా గుర్తు.

ఆ తరువాత నన్ను యింటికి తీసుకెళ్ళిపోయారు. ఐతే, యీసారి, నన్ను బంధించి తీసుకెళ్ళలేదు. నేనుకూడా బుద్ధిగానే కూచున్నాను అల్లరి చెయ్యకుండా.

సైకియాట్రిస్ట్ వల్ల ఏమేం జరగలేదని తెలుస్తూనే వుంది. ఎందుకంటే, నేను సుందర్రావుగారిని గాని, ఆయన నన్ను గాని చూడ్డం ఆ తరువాత జరగలేదు.

మాయతో నా సంసారం సవ్యంగానే సాగిపోతోంది. కాని నా ఒంట్లో నీరసం పెరుగుతోంది గాని, తరగడం లేదు.

ఇలా వుండగా మాయ రెండు రోజుల్నించీ నాకు దూరంగా వుంటోంది. ఎంత బ్రతిమాలుకున్నా, నాకు చేరువకు కూడా రావడంలేదు.

పైగా అవాళ ఉదయంనించీ ఏకధారగా యేడుస్తూనే వుంది. ఊరుకోమంటూ ఎంత బతిమిలాడినా ఊరుకోలేదు. కారణం అడిగినా చెప్పలేదు. "మీరు అరుస్తారా? తీరుస్తారా?...అడిగి ప్రయోజనం యేమిటి?" అంటూ దెప్పి పోటుమాటలు అంటుందిగాని, ఎంతకీ కారణం చెప్పడం లేదు.

చివరికి నేనేదో వాగ్దానం చేస్తేగాని, తన యేడుపుకు కారణం చెప్పేటట్టులేదని గ్రహించాను.

"దేవుడిమీద ఒట్టు. నువ్వేం అడిగినా, నువ్వేం కావాలన్నా చెల్లిస్తాను. నువ్వెందు కేడుస్తున్నావో కారణం చెప్పు" అన్నాను.

అప్పుడు మెత్తపడింది మాయ.

"ఇవాళ సాయంకాలం మీ అమ్మా, నాన్నా మీ యింటికో మనిషిని తీసుకొస్తున్నారు. వాడు పరమ దుర్మార్గుడు. ప్రేమికుల్ని విడదీసే కిరాతకుడు. వాడ్ని చంపాలి" అంది చల్లగా.

నా గుండె నిలిచిపోయింది.

"చంపడమా?...ఎందుకూ?" అన్నాను.

"కారణాలవీ యిప్పుడు అడక్కు. తర్వాత తీరిగ్గా చెప్తాను. నేను కోరింది చేస్తావా చెయ్యవా?" నిలదీసి అడిగింది మాయ.

ఏమని చెప్పను?...జవాబు యివ్వడానికి తటపటాయించాను.

"సరే! ఇవాళనుంచి మన ప్రేమకు స్వస్తి...వస్తాను" అంటూ లేచింది మాయ. ఆమె లేస్తున్నప్పుడు, ఆమె పైట జారి, గుండ్రని గోపురాల్లాంటి వక్షాలు నన్ను ఊరించాయి.

"మాయా!... వెళ్ళకు..." ఆరాటంతో అరిచాను.

"ఎందుకు యింకా యిక్కడ? ఇన్నాళ్ళబట్టీ నీకు తేరగా సుఖాన్ని యిచ్చానేగాని, ఫలానాది కావాలని ఏదైనా కోరానా? అవసరమొచ్చి అడిగేసరికి, కారణాలు అడుగుతున్నావు" అంది మూతి బిగించుకుని.

నాకు మాయ పొందు కావాలి. అందుకు సందేహంలేదు. ఇహ, హత్య సంగతా? నేనేదో పిచ్చిలో చేసా నను కుంటారు. ఒకవేళ నన్ను జైలులో పెట్టినా, నే నెక్కడి కెళితే, అక్కడకు మాయ రాగా నాకేం లోటు?

"సరే! చేస్తాను" అన్నాను.

"ఒట్టూ!" చెయ్యి చాచి అంది.

"దేవుడి తోడుగా." ఆమె చేతిలో చెయ్యివేసి అన్నాను.

"అదీ అలాగుండాలి...ప్రేమంటే" అంటూ నా కిష్ట మైన పద్ధతిలో నన్ను గాఢంగా చుట్టేసి, గట్టిగా ముద్దు పెట్టుకుంది.

అంతేకాదు! మూడు రోజుల్నించి నన్ను యెడంగా వుంచిన ఆమె, తన అవయవాలతో నన్ను తృప్తిగా ఆడుకోనిచ్చింది.

9

మాయ చెప్పినట్టుగానే అవాళ సాయంకాలం ఐదు న్నర గంటలకు సన్నగా, పీలగా, నల్లగా అయిదడుగుల

రెండంగుళాల యెత్తుతో, ఎఱ్రటి అంగరఖా, తెల్ల లుంగీ, భుజాలవరకూ పెంచిన జుత్తు నూనె రాసి నున్నగా దువ్వుకోబడి, నుదుట ఎఱ్రటి కుంకుమతో, చెవులకు కుండలాలు వున్న వ్యక్తి వచ్చాడు.

అతడి వయస్సు ఎంత వుంటుందో అంచనా వెయ్యడం కష్టం. ముప్పైనుంచి, నలభైఅయిదువరకు, అతని వయస్సు ఏదైనా కావచ్చు.

తెల్లగా తళతళ మెరుస్తున్న తన పళ్ళని బయట పడేలా నవ్వుతూ, "ఆఁ ఏం బాబూ?...బావున్నావా?" అన్నాడు నా కెదురుగా ఓ కుర్చీ లాక్కుని కూచుని.

క్షణం రెప్ప వాల్చక అతనివైపు చూచి సీరియస్‌గా "మీకేం పని లేదా? ఊళ్ళో ఉన్నవాళ్ళ నందర్నీ 'బావున్నారా?' అంటూ పలకరించి రావడమేనా పని?" అన్నాను.

అతడు కించపడలేదు. ఇంకా మొహంమీద మాయని నవ్వుతోనే, "ఆఁ అదే బాబూ!...నా వృత్తి, బ్రతుకు, ధ్యేయం, ఆశయం సమస్తమూను" అన్నాడు.

"ఏడ్వలేకపోయారు. ఆ పని యింకో యింటిలో చెయ్యండి. ఇక్కడ మాత్రంకాదు. అర్జంటుగా వెళ్ళిపొండి యిక్కడ్నించి" అన్నాను మొహం మాడ్చుకుని, యింకో వైపుకు త్రిప్పి.

క్షణంసేపు అతనిలో కలవరం కలిగించాననే చెప్ప గలను, ఎందుకంటే, వెంటనే అతడు ఏ మాటా చెప్పలేక పోయాడు.

"ఏం బాబూ! నీకు నూరేళ్ళు హాయిగా, ఆరోగ్యంగా బ్రతకాలని లేదా?" అన్నాడు మెల్లగా, రెండు క్షణాలు పోయాక.

"నేను నూరేళ్ళు బ్రతకాలా, రెండు రోజులే బ్రతకాలా అన్న సంగతి నీకెందుకు? ముందిక్కడ్నించీ పోతావా లేదా?" మంచంమీంచి చివాలున దూకి, అతడి మొహంలో మొహంపెట్టి గట్టిగా అరచాను.

అతడు చలించలేదు.

"నేనిక్కడ్నించి పోవడానికి రాలేదు. నీ అంతు చూద్దామని వచ్చాను" అన్నాడు తాపీగా.

నే నీ క్షణం కోసమే ఆగాను, అతడిమీదకు దుముకకుండా.

"నా అంతు చూస్తావుట్రా బక్కనాకొడకా?" అంటూ పళ్ళు బిగించి, చేతులు బిగబట్టి, బోనులో బంధింపబడిన భల్లూకంలా అటు యిటూ తిరిగి, చివరకు నేను ఓ మూల ముందే దాచుకొన్న కుర్చీ కర్ర అందుకొన్నాను. ఆవేశంగా అతడివైపు కదిలాను, అతడి తలమీద ఆ కర్రతో బాది చంపడానికి.

"ఆగక్కడ," సింహనాదంలా వినిపించింది అతడి గొంతు.

సడెన్ బ్రేకు వేసిన బండిలా ఆగిపోయాను, అప్రయత్నంగానే.

అతడు చప్పున లేచి, కుర్చీ కర్రను పట్టుకొన్న నా చేతిని మెలిపెట్టి, కుర్చీ కర్రను లాగేసుకుని నాకు అందని దూరానికి విసిరేసాడు.

అతడు చూడ్డానికి పిట్టమనిషిలా ఉన్నా, అతడిలో ఏనుగు బలం ఉందని అప్పుడు గ్రహించాను.

నా ప్రయత్నం విఫలమైంది! మాయ నన్ను క్షమించదు! నిరాశ నిండిన హృదయంతో, మంచంమీద వాలిపోయాను నిస్సహాయంగా.

“చూడు బాబూ! ఈ పైడితల్లి భూత, ప్రేత, పిశాచాలకే భయపడడు. ఇహ మనుషులకు భయపడతాడా? నేను రెండు రోజులు పోయాక వస్తాను. నువ్వేం ప్రమాదంలో ఉన్నావో నీకు తెలీడం లేదు. అవాళ తెలుస్తుంది. వస్తాను” అంటూ వెళ్ళిపోయాడు పైడి తల్లి.

పైడి తల్లి యిలా వెళ్ళిపోయాడో లేదో, మాయ వచ్చి, కూచుంది నా కాళ్ళదగ్గర.

“నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిందేమిటి? వాడిలా గదిలో అడుగుపెట్టగానే ఆ కర్రతో ఒక్కటేసివుంటే, యీ పాటికి వాడు చచ్చి వుండేవాడు. అంతా పాడు చేసావు,” రోషంగా అంది మాయ.

మాయ మొహంలోకి చూడలేకపోతున్నాను. అయినా, ఏదో నచ్చచెప్పకపోతే యెలా?

“నువ్వే చూసావుగా...ఎంతటి బలవంతుడో...మనిషి చూడ్డానికి పిట్టలాగున్నాడు కాని, నిజంగా పులి” అన్నాను మెల్లగా.

“ఒక్క కేక వేసేసరికి, ఆగిపోయావు చంటికుర్రాడిలాగ” అంది ఈసడింపుగా.

నిజమే! ఆగిపోయాను. ఆ క్షణంలో ఏమైందో నాకు తెలీదు. పైడితల్లి మెస్మరైజ్ చేసుండాలి. అయితే, అదంతా చెబితే, మాయ యింకేమంటుందో?

మౌనం వహించడమే ఉత్తమోత్తమం అనుకుని ఊరుకొన్నాను.

“మనం దూరమయ్యే రోజులొచ్చాయి. వాడు మనల్ని విడదీసేంతవరకూ వదలడు. రా! ఈ రెండు రోజులయినా హాయిగా వుందాం” అంది మాయ.

నేను శరీరం కదిల్చే స్థితిలో లేను. అయినా, మాయే చొరవ తీసుకుంది. నన్ను తన బలిష్ఠమయిన వక్షాలకు అదుముకుంటూ నన్ను రెచ్చగొట్టి ఉద్రిక్తుడ్ని చేసి, ఓ ప్రక్క బాధగా ఉన్నా, సుఖాన్ని అందించడం మొదలు పెట్టింది.

ఆ రెండు రోజులూ మాయ నన్ను వదిలిపెట్టలేదు. నన్ను ఆమె రెచ్చగొడుతూనే ఉంది. నేను ఆమెను కలుస్తూనే ఉన్నాను.

10

ఆ రోజు శుక్రవారం.

ఉదయం మొహం కడుక్కోవడానికి మంచంమీంచి లేచి రెండడుగులువేసి మొహం తిరిగి పడిపోయాను.

నాకు తెలివి వచ్చేసరికి, అమ్మ ఒడిలో తలపెట్టుకుని ఉన్నాను. అమ్మ ఒకటే ఏడుస్తోంది.

అమ్మను ఆసరాగా చేసుకుని నా కాలకృత్యాలు తీర్చుకొన్నాను.

ఆ తరువాత నా గదిలో కాకుండా, వీధిలో వాలుకుర్చీ వేసి నన్ను కూచోబెట్టింది అమ్మ.

చల్లని ఉదయపు గాలి మొహాన్ని కొడుతుంటే, అలాగే వాలుకుర్చీలో నిద్రపోయాను.

సుమారు పదిగంటలవుతుందేమో, అమ్మ నన్ను లేపి, లోపలి గదిలోకి తీసుకెళ్ళింది.

గది మధ్యగా వేసిన ముగ్గులు, ముగ్గులమధ్య విస్తరాకులో ఉంచిన ఎర్రని మాంసం పోగు, దానికి ఎదురుగా చెక్కబొమ్మ, దానికి అటూ యిటూ మట్టి ప్రమిదల్లో దీపాలు, ఓ మూలగా పరిమళం వెదజల్లుతున్న అగరొత్తులు,

వాటికి యెదురుగా కాస్త దూరంగా మటం వేసు కూర్చున్న పైడితల్లినీ చూడగానే, ఆ రోజున జరగ బోయే తంతుగురించి గుర్తొచ్చింది.

"రా బాబూ! అలా కూచో" అన్నాడు పైడితల్లి చెక్క బొమ్మను, మాంసంపోగును ఎదురుగా ఉన్న జాగా చూపి.

అతడు చెప్పినట్టుగా చేస్తే, మాయ నాకు దూరమై తీరుతుందని మనస్సు నాకు వార్నింగు యిస్తోంది. అయినా, అతడ్ని ప్రతిఘటించే శరీర బలంగాని, మనోబలంగాని నాకు లేవు.

యాంత్రికంగా అతడు చెప్పిన చోటులో పోయి కూచున్నాను.

ముందే పైడితల్లి చెప్పినట్టున్నాడు. అమ్మ బయటికి వెళ్ళిపోయి, తలుపులు వేసింది దగ్గరగా.

గదిలో నేనూ, పైడితల్లీ యిద్దరమే మిగిలాం.

పైడితల్లి కళ్ళు మూసుకుని ఏవో మంత్రాలు పఠించ సాగాడు. ముడివడ్డ అతడి భృకుటివైపు, నిశ్శబ్దంగా గబగబా కదులుతున్న అతని పెదాలవైపు చూడసాగాను ఆసక్తిగా, చేసేదేమీ లేక.

అరగంట గడిచింది. కళ్ళు తెరిచాడు పైడితల్లి.

"బాబూ! మాయ ఎంత అందంగా వుంటుందో చూస్తావా?" అన్నాడు మెల్లిగా.

నాకు నవ్వొచ్చింది. చూడ్డమేమిటి, చిత్తమెచ్చి నట్టుగా చిత్తుగా అనుభవించాను.

అయినా, బైటికి మాత్రం "చూస్తాను. చూపండి" అన్నాను.

''మాయా! ఇలారా కూచో'' అన్నాడు తన చేత్తో ఓ జాగా చూపి.

రెండు క్షణాల్లో మాయ అక్కడ దర్శన మిచ్చింది. పిటపిటలాడుతున్న అవయవాలు, ఎత్తైన బరువైన పెద్ద వక్షాలు, గుండ్రని మొహం, పెద్ద కళ్ళు, క్షణాల్లో పెదాలమీద ప్రత్యక్షమయ్యే నవ్వు.

ఆ అందం నా సొంతమనీ, దాన్ని తనివిదీరా అనుభవించేననీ అనుకునేసరికి నా గుండె గర్వంతో పొంగింది.

రెండు క్షణాలు భావగర్భితంగా మౌనం వహించాక అన్నాడు పైడితల్లి మెల్లగా.

''నువ్విప్పుడు చూస్తున్న అందం నిజంకాదు. దాని అసలు రూపం వేరే ఉంది,'' అని మాయవైపు తిరిగి ''ఊఁ. నీ అసలురూపు చూపెట్టు,'' అంటూ గర్జించాడు పైడితల్లి.

మాయ కదల్లేదు.

''నీకు... మంచి మాటలతో లాభంలేదు,'' అంటూ పళ్ళు కొరికి, వేపమండలు చేతిలోకి దీసుకుని, రెండుసార్లు గట్టిగా నేలమీద బాదాడు.

''బాబోయ్! ఆపు! నువ్వు చెప్పినట్టే చేస్తాను'' అంటూ కంగారుగా లేచి నిలబడింది మాయ.

ఒళ్ళు విరుచుకుంటున్నట్టుగా చేతులు పైకి చాపి, గాల్లోకి లేచి గుండ్రంగా తిరిగింది ఓసారి.

రెండోసారి, మాయ నావైపు తిరగ్గానే, ఆమె పూర్తిగా మారిపోయింది.

పీచులాంటి జుత్తు, పుసులు కట్టి, కారుతున్న కళ్ళు, వదులుగా వేలాడి చొంగలు కారుతున్న పెదాలు, నల్లని

పొడుగాటి సంచుల్లాంటి స్తనాలు-అసహ్యాంగా జుగుప్సా కరంగా, భీకరంగా వుంది ఆ రూపం.

ఆ రూపాన్ని ఇంతకు ముందోసారి చూసాను. అవధాని గదిలో, మాయతో శాశ్వత సంపర్కంకోసం, ముగ్గుల మధ్య కూచున్నప్పుడు. నా మనోఫలకంమీద అఖర్న నిలిచింది యీ రూపే!

"అబ్బ!...చూడలేను" కళ్లు మూసుకొన్నాను వీహ్యతతో ఒళ్ళు కంపించగా.

"కళ్ళు మూసుకుంటావేం బాబూ!...దానితోనేగా యిన్నాళ్ళు కాపురం చేసావు" అన్నాడు పైడితల్లి నవ్వి, దెప్పిపొడుస్తున్నట్టుగా.

అప్పటికి మాయమీది నా వ్యామోహం పూర్తిగా చచ్చిపోయింది. ఇహ, ఆమె మునుపటి రూపంలో మళ్ళా వచ్చినా, తాకే స్థితిలో లేను.

"బాబూ! ఈ సమయంలో నీకో విషయం చెప్పాలి." అన్నాడు తాపీగా పైడితల్లి.

"ఏమిటది?" అన్నాను, గాలిలో నిలుచున్న మాయ వికృతరూపంవైపు క్షణం చూసి, యిహ చూడకూడదనుకుని నిశ్చయించుకుని.

"ఈమె ఓ కామినీ పిశాచి. దీన్ని నీమీద ప్రయోగించాడు అవధాని."

"అవధానా?...నా మీదా?...ఎందుకూ?" అన్నాను ఆశ్చర్యంగా.

"కామినీపిశాచాలు మనుషుల్ని పట్టి వాళ్ళ రక్తవీర్యాలు పీల్చి చంపుతాయి. ఈ విషయం నీకు తెలిసేవుంటుంది. నీ విషయంలో అవధాని కామినీపిశాచిని నీకు అంటగట్టాడు, నిన్ను హతమార్చే ఉద్దేశంతో."

“నాకు నమ్మ శక్యంగాకుండా వుంది. అవధానికి నన్ను చంపాల్సిన అవసర మేమొచ్చింది?” అన్నాను అనుమానంగా.

“ఈ రెండు రోజుల్లో నీ గురించి కొంచెం ఆరాలు తీసాను. నీకు అందమైన అమ్మాయిలంటే విపరీతమైన పిచ్చనీ, యీ ప్రయోగం జరగక ముందు నువ్వు రంజని అనే అమ్మాయిని ప్రేమించేవాడివనీ తెలియవచ్చింది.

అంతేకాదు. ఇంకొంచెం ముందుకుపోయి విచారణ సాగించాను. మావాడొకడ్ని అవధాని దగ్గరకు పంపాను. మా యెరికలో వున్న కుర్రాడొకడికి మనసు విరిచెయ్యాలనీ, వాడ్ని ఏదో ప్రయోగంద్వారా చంపెయ్యాలనీ, అందుకు అవధాని ఏమాత్రం తీసుకుంటాడో కనుక్కొరమ్మని మా వాడ్ని అడగమన్నాను.

అవధానికి తెలివితేటలు అపారంగా వున్నాయి. కాని, నా విషయంలో పని చెయ్యలేదు. చేస్తాను, ఓ అయిదు వేలు యిటు పారేయ్! అన్నాడు అవధాని.

“ఇస్తాను. గేరంటీ యేమిటి?” అన్నాడు మావాడు. ఫలానా వీధిలో ఫలానా కుర్రాడికి ప్రయోగం చేసాను. అంటూ అవధాని నీ పేరు చెప్పాడు. ‘ఎల్లుండికి టపా కట్టేస్తాడు. కావలిస్తే అది జరిగాకే డబ్బియ్యి” అంటూ భరోసాకూడా చెప్పాడు.

మావాడు అమాయకత్వం నటిస్తూ, మరికొన్ని ప్రశ్నలు వేసేసరికి, నీ స్నేహితుడు శేఖరమే, యీ ప్రయోగం చెయ్యమన్నట్టుగా కూడా చెప్పాడు అవధాని” అంటూ వివరించాడు పైడితల్లి.

నేను అవాక్కయిపోయాను.

అప్పటివరకూ జరిగిన సంఘటనలన్నీ నా కళ్ళముందు కదులాడాయి వరుసగా.

నామీద కామినీప్రయోగం జరిగిందనే భావన నాలో యెప్పటికీ కలగకుండా, నా అంతట నేనే, దాన్ని కోరి ఆహ్వానించినట్టుగా, పటిష్టంగా అవధాని వేసిన పథకంలో నే నెలా యిరుక్కుపోయానో, అప్పటికి అర్థమయింది.

"మరి నా సంగతి మీ కెలా తెల్సింది?" అన్నాను ఆలోచనల్లోంచి తేరుకుని.

"అదేమిటి బాబూ! అలాగంటావ్? రోజురోజుకీ నువ్వు చిక్కిపోతుంటే, జీవకళ తొణికిసలాడాల్సిన నీ కళ్ళల్లో ప్రేత కళ కనబడుతుంటే, మీ తల్లి కెలా వుంటుంది చెప్పు? నిన్ను బాగుచెయ్యాలనే ఆమె చేసిన ప్రయత్నంలోనే నన్ను కలుసుకోవడం జరిగింది. తన బాధంతా చెప్పుకుని యేడ్చారు. ఇంతకూ, యీ కామ పిశాచిని యేం చేద్దామంటావ్?" అన్నాడు పైడితల్లి, యింకా గాల్లో వేళ్ళాడుతున్న మాయను చూపి.

"నువ్వేం చెయ్యదల్చుకొన్నావో...అదే చెయ్యి. నాకు యిలాంటి విషయాలు అంతగా తెలీవు. కాని, ఒక్క మాట. మళ్ళా నాకు యిరుపంచల రాకుండా చూడు. అది చాలు" అన్నాను; పైడితల్లి మీద పెరుగుతున్న కృతజ్ఞతాభావంతో.

"సరే!" అంటూ పిశాచివైపు తిరిగి, "యీ మాంసాన్ని భోంచేసి మరి అవుపించకుండా వెళ్ళిపో. మళ్ళా యిటు వచ్చావా. ఈసారి నిన్ను నాలుగు నిలువుల గోతిలో నెత్తి మీద మేకు దిగ్గొట్టి పాతాల్సి వస్తుంది," అన్నాడు పైడి తల్లి.

తనని అంతటితో వదిలివేస్తున్నందుకు, పిశాచి కృతజ్ఞతాపూర్వకంగా వంగి నమస్కారం చేసింది. ఆ తరువాత, విస్తరాకులోని మాంసం పోగుని క్షణంలో తినేసి అదృశ్యమైంది.

పైడితల్లి ముగ్గుల మధ్యనున్న చెక్కబొమ్మను తీసుకెళ్ళి దొడ్లో పాతిపెట్టి వచ్చాడు.

"బాబూ! మీకు చెప్పాల్సినవాడ్ని కాను. పరుల స్త్రీలకు, పరుల డబ్బుకు ఆశపడ్డం, అంత మంచిదికాదు బాబూ! చూసారా ... ఇంకొక్క రోజు ఆలస్యమైతే, మీరు మాకు దక్కేవారు కారు" అన్నాడు పైడితల్లి బయలుదేరడానికి ఉపక్రమిస్తూ.

నేను అతడిని కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ ఉండిపోయాను.

—: ఐ పో యిం ది :—